Follow: @ANNTELUGU

14-07-2025

ANN తెలుగు

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 221 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



# బోనమెత్తిన లష్కర్

- మహంకాళీ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- తొలి బోనం సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు
- ప్రత్యేక పూజల్లో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి, బిజెపి చీఫ్ రామచందర్ రావు
- శోభాయమానంగా బోనాలు



లష్కర్‌లోని ఉజ్జయిని మహంకాళీ అమ్మవారికి భక్తులు శోభాయమానంగా బోనాలు సమర్పించారు. సికింద్రాబాద్ లష్కర్ బోనాలు ఆదివారం ఘనంగా జరిగాయి. శ్రీ ఉజ్జయిని మహంకాళీ అమ్మవారిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దర్శించుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ అనిల్, ఎమ్మెల్యే దానం నాగేందర్ .. ఇతర అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. తెలంగాణ ప్రభుత్వం తరపున అమ్మవారికి సీఎం పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారిని మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు దర్శించుకున్నారు. సీఎంతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్.. కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ సలహా దారు హర్కర వేణుగోపాల్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే లు శ్రీ గణేష్,దానం నాగేందర్ ప్రత్యేక పూజలు చేశారు. బోనాల వేడుకకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణంలో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలు, తొట్టెళ్లు, ఫలహార బండ్ల ఊరేగింపు కోలాహలంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల నృత్యాలు, కోలాట బృందాలు, గుస్సాడీ, పులివేషధారణ, డప్పు కళాకారుల చప్పుళ్లతో అమ్మవారి ఆలయ ప్రాంగణం శోభాయమానంగా మారింది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి బారులు తీరారు. బోనాల వేడుకలు ఘటోత్సవంతో మొదలయ్యాయి.

- మహా, సికింద్రాబాద్

వివరాలు 2లో

## టాప్ న్యూస్

### పాలిటిక్స్ కలుషితమయ్యాయి



- ప్రజాస్వామిక విలువలు మరిచిపోతున్నారు
- సమాజాన్ని మేలుకొలిపే బాధ్యత మీడియాదే
- ఎప్పుడూ నిజాయితీగా ఉంటా.. ఖమ్మం అభివృద్ధే లక్ష్యం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇంట్రెస్టింగ్ కామెంట్స్

05

### కవితపై మల్లన్న వ్యాఖ్యలు తప్పు



- మల్లన్న ఆఫీస్ పై కవిత అనుచరుల దాడి చట్టవ్యతిరేకం
- రెండింటినీ ఖండించిన పీసీసీ చీఫ్ మహేష్
- బీసీ రిజర్వేషన్లు మా హామీ.. మా ఘనత

05

### మల్లన్నకు బీఆర్ఎస్ వార్నింగ్



- కవితకి క్షమాపణ చెప్పాలని డిమాండ్
- మండలి బిఆర్ఎస్ పక్షనేత మధుసూధనాచారి పోస్ట్

05



# ఎమ్మెల్సీ మల్లన్నపై హత్యాయత్నం

## కార్యాలయం ధ్వంసం

- గన్ మెన్లు, సిబ్బందిపై దాడి.. గాల్లోకి కాల్పులు జరిపిన గన్ మెన్లు
- నన్ను చంపేందుకు కల్వకుంట్ల కవిత తెగబడింది
- కవిత ఒక ఎమ్మెల్సీ అయి ఉండి..
- ఇంకో ఎమ్మెల్సీ మీద దాడి చేయించడమేంటి?
- ఆమె లేడీ నయీమ్.. బీసీ పార్టీ పెడుతున్నందుకే ఇదంతా
- నాపై దాడిచేసిన వారు రాజకీయంగా సమాధి అవుతారు
- కవిత కుటుంబమో.. మేమో తేల్చుకుంటాం
- కవిత ఎమ్మెల్సీ సభ్యత్వం రద్దు చేయాలి.. తీన్మార్ మల్లన్న

మేడ్చల్ జిల్లాలోని మేడిపల్లిలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడి జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తీన్మార్ మల్లన్న ఆఫీస్ పై ఆమె అనుచరులు దాడికి దిగారు. కవిత చేస్తున్న బీసీ ఉద్యమాన్ని మల్లన్న తప్పబడుతూ వ్యాఖ్యలు చేశారని తెలంగాణ జాగృతి కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లన్న కార్యాలయంలోని ఫర్నీచర్, కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. ఈ క్రమంలో ఆందోళనకారులను అడ్డుకునేందుకు మల్లన్న గన్‌మెన్ గాల్లోకి ఆరు రౌండ్లు కాల్పులు జరిపాడు.

- మహా, హైదరాబాద్

వివరాలు 2లో





## ప్రశ్నిస్తే కాల్చేస్తారా?

- తీన్మార్ మల్లన్నను అరెస్ట్ చేయాలి
- ఎమ్మెల్సీ రద్దు చేయాలి.. గన్ మెన్లపై చర్య తీసుకోవాలి
- నా పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చర్యలు తీసుకోరా?
- సీఎం కుటుంబానికో న్యాయం.. నాకో న్యాయమా?
- వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా, కించపరిచేలా మల్లన్న వ్యాఖ్యలు
- మండలి ఛైర్మన్ గుత్తా, డీజీపీలకు ఎమ్మెల్సీ కవిత ఫిర్యాదు

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తనపై చాలా దారుణమైన వ్యాఖ్యలు చేశారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మహిళాలోకం భగ్గుమంటున్నదని, మల్లన్నపై వెంటనే చర్యలు తీసుకోవాలని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి ఆమె ఫిర్యాదు చేశారు. విచక్షణాధికారాలు ఉపయోగించి ఆయన్ను ఎమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు.తెలంగాణలో మహిళలకు ప్రత్యేకమైన గౌరవం ఉంటుందని, బోనం ఎత్తుకున్న ఆడబిడ్డను అమ్మవారిలా చూసే సంస్కృతి మనదన్నారు.

- మహా, హైదరాబాద్

వివరాలు 2లో

## ఈగల్ టీమ్

- స్పెషల్ డెకాయ్ ఆపరేషన్
- 10 మంది డ్రగ్స్ వినియోగదారుల అరెస్ట్

వివరాలు 2లో

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

**అర్హులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు.. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి పెద్దపీట**

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

ప్రారంభోత్సవాలలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర, జూపల్లి



**మంచిర్యాల, మహా :** ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం జిల్లా లక్షెట్టిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ,

మిగతా 2లో



## దివికేగిన కోట

- అనారోగ్యంతో కోట శ్రీనివాస రావు కన్నుమూత
- 'ప్రాణం ఖరీదు' సినిమాతో సినీ రంగంలోకి తెరంగేట్రం
- 750కి పైగా సినిమాల్లో అలరించిన లెజెండరీ
- తమిళ, హిందీ, కన్నడ, మళయాళంలో నటనతో గుర్తింపు
- 2015లో పద్మ శ్రీ పురస్కారం, 9 నంది అవార్డులు సైతం సొంతం
- కోట మృతికి సినీ, రాజకీయ ప్రముఖుల సంతాపం
- మహాప్రస్థానంలో ముగిసిన విలక్షణ నటుడి అంత్యక్రియలు

03

## అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ చీఫ్ రామచంద్ర రావు



తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్ర రావు ఆదివారం సాయంత్రం సికిందరాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీర్వాదంతోనే తాను ఇంత దూరం వచ్చానని అన్నారు. తెలంగాణ ప్రజలకు శాంతి, ఆయురారోగ్యాలు ప్రసాదించమని ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. భక్తి, ఉత్సాహం, సంప్రదాయాల సౌరభంతో నిండిన బోనాల పండుగ జరుపుకుంటున్న ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అన్నారు.

## నేడే రేషన్ కార్డుల పండుగ!

- ఇవాల్టి నుంచే కొత్త కార్డుల పంపిణీకి శ్రీకారం
- ఉమ్మడి నల్గొండ జిల్లాలో సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభం
- కొత్తగా రెండున్నర లక్షల కొత్త కార్డులు ఇవ్వనున్న సర్కార్
- రాష్ట్రంలో మొత్తం 3.14 కోట్ల మంది ప్రజలకు లబ్ధి

02

# ఎమ్మెల్సీ మల్లన్నపై హత్యాయత్నం

## కార్యాలయం ధ్వంసం



**హైదరాబాద్, మహా :** మేడ్చల్ జిల్లాలోని మేడిపల్లిలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడి జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తీన్మార్ మల్లన్న ఆఫీస్ పై ఆమె అనుచరులు దాడికి దిగారు. కవిత చేస్తున్న బీసీ ఉద్యమాన్ని మల్లన్న తప్పు బడుతూ వ్యాఖ్యలు చేశారని తెలంగాణ జాగృతి కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లన్న కార్యాలయంలోని ఫర్నీచర్, కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. ఈ క్రమంలో ఆందోళనకారులను అడ్డుకునేందుకు మల్లన్న గన్‌మెన్ గాల్లోకి ఆరు రౌండ్లు కాల్పులు జరిపాడు. దాడి సమయంలో తీన్మార్ మల్లన్న కార్యాలయంలోనే ఉన్నారు. ఆయన చేతికి కూడా గాయమైంది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని ఆందోళనకారులను అదుపు చేశారు. దాడి కారకుల సమాచారం సేకరిస్తున్నారు.

### కవిత సభ్యత్వం రద్దు చేయాలి

కవితకు ఉనికి కావాలంటే కేసీఆర్‌ను అడగొచ్చని, ఉనికి కోసం బీసీ నాయకత్వంపై దాడి చేస్తే ఊరుకోబోమని తీన్మార్ మల్లన్న హెచ్చరించారు. కేసీఆర్, కేటీఆర్‌పై ఉన్న ఫ్రస్టేషన్ కవిత తమపై చూపిస్తామంటే కుదరదని, సహచర ఎమ్మెల్సీపై దాడి చేసిన కవిత సభ్యత్వం రద్దు చేయాలని తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు. తమ గన్‌మెన్ ఆయుధం తీసుకొని తనపై దాడికి యత్నించారని, కవిత ఒక ఎమ్మెల్సీ అయి ఉండి సాటి ఎమ్మెల్సీపై హత్యాయత్నం చేయించారని మల్లన్న మండిపడ్డారు. తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడి జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. క్యూన్యూస్‌పై దాడి చేసిన వారిలో మహిళా జాగృతి కార్యకర్తలు ఉన్నారు. మల్లన్నపై దాడికి వెళ్తున్న వారిని తీన్మార్ మల్లన్న గన్‌మెన్లు అడ్డుకున్నారు. దాడిని నిలువరించే క్రమంలో గన్‌మెన్లు గాల్లోకి ఆరు రౌండ్ల కాల్పులు జరిపారు. దాడి ఘటనపై డయల్ 100కు ఫోన్ చేసి తీన్మార్‌మల్లన్న ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలికి చేరుకొని దాడి ఘటనపై ఆధారాలను, బుల్లెట్ షెల్స్‌ను క్లూస్‌టీమ్ సేకరించింది. దీంతో వెంటనే క్యూ న్యూస్ కార్యాలయం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మల్లన్నకు సంఘీభావంగా పలువురు బీసీ సంఘాల నేతలు నిరసన తెలిపారు. తీన్మార్ మల్లన్న, కల్వకుంట్ల కవిత కార్యకర్తల మధ్య గొడవలో ఒకరికి గాయాలయ్యాయి. సాయి అనే వ్యక్తికి బుల్లెట్ గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. కాగా దాడి ఘటనను పలువురు నేతలు ఖండించారు.

### నాపై హత్యాయత్నం : తీన్మార్ మల్లన్న

హత్యాయత్నాలతో బీసీ ఉద్యమం ఆగదని ఇలాంటి దాడులకు భయపడమని తీన్మార్ మల్లన్న అన్నారు. తమ గన్‌మెన్ చేతిలో గన్ తీసుకుని తనపై దాడి చేశారని, చేతికి కూడా గాయమైనట్లు చెప్పారు. తమపై దాడి చేయించిన వారు భవిష్యత్‌లో రాజకీయంగా సమాధి అవుతారని పేర్కొన్నారు. తీన్మార్ మల్లన్నపై హత్యాయత్నం చేసేందుకు కల్వకుంట్ల కవిత కుటుంబం తెగబడిందని, కవిత కుటుంబమో తామో తేల్చుకుంటామని ఆయన చెప్పారు. ప్రభుత్వంపై తాము పోరాడుతుంటే కవితకు ఏం బాధ అని ప్రశ్నించారు.





# బోనమెత్తిన లష్కర్

**సికింద్రాబాద్, మహా :** లష్కర్‌లోని ఉజ్జయిని మహంకాళీ అమ్మవారికి భక్తులు శోభాయమానంగా బోనాలు సమర్పించారు. సికింద్రాబాద్ లష్కర్ బోనాలు ఆదివారం ఘనంగా జరిగాయి. శ్రీ ఉజ్జయిని మహంకాళీ అమ్మవారిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దర్శించుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ అనిల్, ఎమ్మెల్యే దానం నాగేందర్ .. ఇతర అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. తెలంగాణ ప్రభుత్వం తరపున అమ్మవారికి సీఎం పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారిని మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు దర్శించుకున్నారు. సీఎంతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్.. కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ సలహా దారు హార్కర వేణుగోపాల్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే లు శ్రీ గణేష్,దానం నాగేందర్ ప్రత్యేక పూజలు చేశారు. బోనాల వేడుకకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణంలో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలు, తొట్టెల్లు, ఫలహార బండ్ల ఊరేగింపు కోలాహలంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల నృత్యాలు, కోలాట బృందాలు, గుస్సాడీ, పులివేషధారణ, డప్పు కళాకారుల చప్పుళ్లతో అమ్మవారి ఆలయ ప్రాంగణం శోభాయమానంగా మారింది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి బారులు తీరారు. బోనాల వేడుకలు ఘటోత్సవంతో మొదలయ్యాయి.

**తొలి బోనం సమర్పించిన మంత్రి ప్రభాకర్ దంపతులు**

ఉజ్జయిని మహంకాళి అమ్మవారి (లష్కర్) బోనాలు ఘనంగా ప్రారంభం కాగా, ఆదివారం వేకువ జాము నుంచే భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు తొలి బోనం సమర్పించారు. అనంతరం మంత్రి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ వారి దర్శనంలో ఏ మాత్రం ఆలస్యం జరుగకుండా ఉండేందుకు వీలుగా ఈ సారి ఆరు లైన్లలో భక్తులకు దర్శనానికి అనుమతించారు. దీంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. అదే విధంగా బోనాలు సమర్పించడానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా రెండు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. శివసత్తులకు ప్రత్యేకంగా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు ఆర్ పీ రోడ్, బాట షో రూం నుంచి ప్రవేశం కల్పించారు. దేవాలయానికి భక్తులు వెళ్లేందుకు వివిధ మార్గాల్లో పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేశారు. లష్కర్ బోనాల జాతర ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఉజ్జయిని మహంకాళి బోనాలకు పోలీసులు పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. పోతురాజుల నృత్యాలు, కోలాట బృందాలు, గుస్సాడీ, పులివేషధారణ, డప్పు కళాకారుల చప్పుళ్లతో అమ్మవారి ఆలయ ప్రాంగణం శోభాయమానంగా మారింది. అమ్మవారి నామస్మరణతో ఆలయ పరిసర ప్రాంతాలన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

## తెల్లవారుజాము నుండే...

తెల్లవారుజాము మూడు గంటల ప్రాంతంలోనే ఆలయానికి వచ్చిన హైదరాబాద్ ఇంఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కుటుంబ సమేతంగా అమ్మవారికి తొలిబోనం సమర్పించారు. అమ్మవారికి మహా హారతి, కుంకుమ, పుష్ప అర్చనలు నిర్వహించారు. సాకలు సమర్పించి విశేష నివేదన చేశారు. అమ్మవారి దివ్యసన్నిధిలో కర్పూర నీరాజనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసంలో ప్రత్యేకతను సంతరించుకున్న బోనాల పండుగలో అమ్మవారిని ఆరాధించడం ఆనవాయితీగా వస్తోంది. రైతులు పాడిపంటలతో సమృద్ధిగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహంకాళి బోనాలను రాష్ట్ర పండుగగా గుర్తించి వైభవంగా నిర్వహిస్తుందని తెలిపారు. అమ్మవారి బోనాన్ని అలంకరించి అంగరంగ వైభవంగా ఉత్సవాలను ప్రారంభించినట్లు వెల్లడించారు. తెలవారుజామున 3 గంటల నుంచే ఇక్కడ బోనం సమర్పించడానికి అక్కాచెల్లెళ్లు అందరూ వస్తున్నారని పేర్కొన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను ప్రభుత్వ యంత్రాంగం చేసిందని మంత్రి స్పష్టం చేశారు.

# ప్రశ్నిస్తే కాల్చేస్తారా?

## తీన్మార్ మల్లన్నను అరెస్ట్ చేయాలి



**హైదరాబాద్, మహా :** ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తనపై చాలా దారుణమైన వ్యాఖ్యలు చేశారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మహిళాలోకం భగ్గుమంటున్నదని, మల్లన్నపై వెంటనే చర్యలు తీసుకోవాలని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి ఆమె ఫిర్యాదు చేశారు. విచక్షణాధికారాలు ఉపయోగించి ఆయన్ను ఎమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో మహిళలకు ప్రత్యేకమైన గౌరవం ఉంటుందని, బోనం ఎత్తుకున్న ఆడబిడ్డను అమ్మవారిలా చూసే సంస్కృతి మనదన్నారు. ఇప్పుడిప్పుడే రాష్ట్రంలో మహిళలు రాజకీయాల్లోకి వస్తూ ప్రజా సమస్యలపై మాట్లాడుతున్నారని, బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తులు పరుషపదజాలంతో విమర్శలు చేస్తే వచ్చేవాళ్లు కూడా వెనక్కి తగ్గే పరిస్థితి ఉంటుందన్నారు. ఉచ్చరించలేని దారుణమైన వ్యాఖ్యలను మల్లన్న చేశారని ఫైర్ అయ్యారు. ఆయనను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబసభ్యులపై వ్యాఖ్యలు చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేశారని, తనమీద చేసిన వారిని కూడా అరెస్ట్ చేయాలన్నారు.

**మల్లన్నను ఒక్క మాట కూడా అనలేదు**

ఆడబిడ్డలు రాజకీయాల్లోకి రావద్దా? అంటూ కవిత ప్రశ్నించారు. ఏదైనా ఉంటే అంశం ప్రాతిపదికన మాట్లాడాలి తప్ప ఏం మాటలివి? దాదాపు ఏడాదిన్నరగా బీసీ సమస్యలపై తెలంగాణ జాగృతి తరఫున పోరాటం చేస్తున్నామన్నారు. ఏ రోజూ తీన్మార్ మల్లన్నను ఒక్క మాట కూడా అనలేదని చెప్పారు. నన్ను ఆయన ఎందుకు అలా అన్నారో తెలియదని చెప్పుకొచ్చారు. తెలంగాణ ప్రజలు పరుష పదజాలాన్ని సహించరని, మల్లన్న చేసిన వ్యాఖ్యలకు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపేందుకు జాగృతి కార్యకర్తలు వెళ్లారని, సామాన్యులపై కాల్పులు జరిపేంత క్రూరత్వం ఎందుకు? అంటూ మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యం. దీనిలో అనేక మంది ప్రజల జీవితాలు ముడిపడి ఉన్నాయన్నారు. జాగృతి ఎన్నో కార్యక్రమాలు చేసింది.. అందులో బీసీ ఉద్యమం ఒకటి అంటూ వ్యాఖ్యానించారు. ఇంకా చాలా కార్యక్రమాలు చేస్తామని, నాలాంటి వాళ్లను కోట్లాది మందిని తయారు చేస్తామన్నారు. తక్షణమే తీన్మార్ మల్లన్నను సీఎం రేవంత్ అరెస్ట్ చేయించాలని డిమాండ్ చేశారు. మల్లన్న చేసిన వ్యాఖ్యలపై జాతీయ మహిళా కమిషన్‌ను కలుస్తామని కవిత స్పష్టం చేశారు.

### డీజీపీకి కవిత ఫిర్యాదు

అనంతరం తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలపై డీజీపీ కార్యాలయంలో ఐజీకి కవిత ఫిర్యాదు చేశారు. పెద్ద ఎత్తున జాగృతి కార్యకర్తలతో ఆమె డీజీపీ కార్యాలయానికి చేరుకున్నారు. తన పైన అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్న మీద కంప్లైంట్ చెయ్యడానికి డీజీపీ ఆఫీసుకు వచ్చానని, జాగృతి కార్యకర్తలపై దాడి చేయించింది తీన్మార్ మల్లన్నా !?.. లేక ప్రభుత్వమా !? అనేది తెలియాలని, దీని మీద సమగ్ర విచారణ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానన్నారు. గన్ మెన్స్ ఎందుకు షూట్ చెయ్యాల్సి వచ్చిందనేది తెలియాలని, మల్లన్న ఆదేశాలు లేకుండా గన్ మెన్స్ షూట్ చెయ్యరన్నారు. తమ కార్యకర్తలపైన కాల్పులు జరిపిన తీన్మార్ మల్లన్న గన్మెన్లను వెంటనే డిస్మిస్ చెయ్యాలన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా ఏ గన్ మెన్ కానీ పోలీసులు కానీ కాల్పులు జరపలేదని, కానీ ఇపుడు తీన్మార్ మల్లన్న గన్ మెన్స్ ఇలా కాల్పులు జరపడం బాధాకరమన్నారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

## అర్హులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు.. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి పెద్దపీట

### తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

### ప్రారంభోత్సవాలలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర, జూపల్లి

(మొదటిపేజీ తరువాయి)

శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, జి.సి.సి. ఛైర్మన్ కొట్నాక తిరుపతి, కనీస వేతన బోర్డు ఛైర్మన్ జనక్ ప్రసాద్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల ఏర్పాటు, నవీకరణల కొరకు వివిధ కార్యక్రమాలను చేపట్టిందని వెల్లడించారు. ఇందులో భాగంగా లక్షెట్టిపేట మండల కేంద్రంలో 8 కోట్ల 50 లక్షల రూపాయల ప్రభుత్వ నిధి, 1 కోటి రూపాయల సింగరేణి నిధులతో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. మండల కేంద్రంలో 10 కోట్ల 20 లక్షల రూపాయల సి.ఎస్.ఆర్., డి.ఎం.ఎఫ్.టి. నిధులతో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగిందని స్పష్టం చేశారు. తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థిని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంచి నూతన మెనూ ఖచ్చితంగా అమలు చేస్తూ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ఉపాధ్యాయుల నియామకం ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించడం జరుగుతుందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాల ద్వారా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు.

**మహిళా శక్తి సోలార్ ప్లాంట్ శంకుస్థాపన**

దండపల్లి మండలం రెబ్బనపల్లిలో మహిళా శక్తి సోలార్ ప్లాంట్ ను ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళలకు చేయూతనిస్తూ దండేపల్లి మండలం అందుగులపేట (వెల్గనూర్) గ్రామంలో 4 ఎకరాల విస్తీర్ణంలో 3 కోట్ల రూపాయల వ్యయంతో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. 90 శాతం బ్యాంకు రుణం, 10 శాతం గ్రామ సంఘాల వాటాతో రోజుకు సుమారు 4 వేల 500 నుండి 5 వేల యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి జరిగి సంవత్సరానికి దాదాపు 51 లక్షల రూపాయల రాబడి వస్తుందని పేర్కొన్నారు. నర్సింగాపూర్ గ్రామంలో 1 కోటి 63 లక్షల రూపాయల సి. ఎస్. ఆర్. నిధులతో 2/200 కి.మీ. నుండి 3/100 కి. మీ. కొరకు 900 మీటర్ల మేర సి.సి. రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 80 లక్షల రూపాయల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో 4 గ్రామపంచాయతీ భవనాలు, 48 లక్షల రూపాయలతో 4 అంగన్వాడి భవనాల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని వివరించారు. లక్షెట్టిపేట మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో 1 కోటి రూపాయలతో ఎస్.సి.ఎస్.డి.ఎఫ్. క్రింద సి. సి. రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. హాజీపూర్ మండలం చిన్న గోపాల్‌పూర్, ర్యాలీ గ్రామాలలో 2 కోట్ల 50 లక్షల రూపాయల ఎస్.టి.ఎస్.డి.ఎఫ్., ఎస్.సి.ఎస్.డి.ఎఫ్ నిధులతో నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వేంపల్లి, పోచంపహాడ్ శివారులలో 212 ఎకరాల భూమి విస్తీర్ణంలో 30 కోట్ల రపాయల వ్యయంతో అత్యాధునిక సదుపాయాలతో ఐ. టి./ ఇండస్ట్రియల్ పార్క్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

**కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం**

మహిళా సంఘాల బలోపేతానికి కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా ఆర్థిక అభివృద్ధి కోసం సంవత్సరానికి 20వేల కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణంగా అందించేందుకు చర్యలు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. ఇందులో మొదటి సంవత్సరం 21 వేల 632 కోట్ల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆర్. టి. సి. బస్సులు నడిపించేందుకు 600 బస్సుల ప్రతిపాదనలో 150 బస్సులను ఇవ్వడం జరిగిందని వెల్లడించారు. త్వరలో 450 బస్సులను ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, పెరటి కోళ్ల పెంపకం, పాల డైరీ, పెట్రోలు బంకుల నిర్వహణ, మహిళా శక్తి భవనాల ఏర్పాటు, చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా 70 లక్షల రైతు కుటుంబాలకు రైతు భరోసా క్రింద 9 రోజులలో 9 వేల కోట్ల రూపాయల పెట్టుబడి సహాయం అందించడం జరిగిందని తెలిపారు. అలాగే 21 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేయడంతో పాటు పంట నష్టపరిహారం అందించడం జరిగిందని తెలిపారు. 29 లక్షల పంప్ సెట్లను 17 వేల కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 93 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం అందించడం జరిగిందని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని 10 లక్షల రూపాయలకు పెంచడం జరిగిందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గానికి 3 వేల 500 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను 22 వేల 500 కోట్ల రూపాయలతో లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే రాయితీ గ్యాస్ సిలిండర్ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఈగల్ టీమ్ స్పెషల్ డెకాయ్ ఆపరేషన్

## 10 మంది డ్రగ్స్ వినియోగదారుల అరెస్ట్

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్‌లో గంజాయి నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు ఈగల్ టీమ్ ఆదివారం స్పెషల్ డెకాయ్ ఆపరేషన్ నిర్వహించింది. అయితే, ఈ ఆపరేషన్లో నిర్ఘాంతపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. మహారాష్ట్రకి చెందిన సందీప్ అనే గంజాయి సరఫరా దారుడిని అరెస్ట్ చేశారు ఈగల్ సెల్ అధికారులు. అతని కాంటాక్ట్ లిస్ట్ ద్వారా ఈగల్ టీమ్ డెకాయ్ ఆపరేషన్ నిర్వహించింది. హైదరాబాద్ గచ్చిబౌలి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలో ఈ ఆపరేషన్ నిర్వహించింది ఈగల్ టీమ్. ఇందులో మొదటగా గంజాయి వచ్చిందంటూ కస్టమర్లకు వాట్సాప్ సందేశం పెట్టారు పోలీసులు. అంతే, మెసేజ్ పెట్టిన రెండు గంటల్లో లొకేషన్‌కు 14 మంది వినియోగదారులు పరుగుపరుగున వచ్చేశారు.

**వాట్సాప్ కోడ్ భాషతో సరఫరా..**

'భాయ్ బచ్చా ఆగయా భాయ్' పేరుతో వాట్సాప్ కోడ్ భాషతో సరఫరా చేస్తున్న విషయాన్ని పసిగట్టిన పోలీసులు ఇదే కోడ్ ఉపయోగించి వాట్సాప్ మెసేజ్ చేయడం ద్వారా వీళ్ల బండారం బయటపడింది. దీంతో వాట్సాప్ గ్రూప్‌లో ఉన్న 100 మంది వివరాలను పోలీసులు సేకరించారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో 14 మంది ఉండగా, మిగతా 86 మందిని ట్రేస్ చేస్తున్నారు. 14 మందికి ర్యాపిడ్ టెస్ట్ కిట్‌లతో పరీక్షలు నిర్వహించగా గంజాయి పాజిటివ్ అని నిర్ధారణ అయింది. ఈ 14 మందిలో రెండు జంటలు ఉండగా.. ఒక భార్య, భర్త తమ 4 ఏళ్ల పిల్లాడితో గంజాయి కొనేందుకు వచ్చారు. వీరిలో భర్తకి పాజిటివ్ అని తేలింది.

# నేడే రేషన్ కార్డుల పండుగ!

## ఇవాల్టి నుంచే కొత్త కార్డుల పంపిణీకి శ్రీకారం

- ఉమ్మడి నల్గొండ జిల్లాలో సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభం
- కొత్తగా రెండున్నర లక్షల కొత్త కార్డులు ఇవ్వనున్న సర్కార్
- రాష్ట్రంలో మొత్తం 3.14 కోట్ల మంది ప్రజలకు లబ్ధి

**హైదరాబాద్, మహా:** మరికొన్ని గంటల్లో కొత్త రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం సిద్ధమైంది. నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం స్టార్ట్ అవుతుంది. చాలా కాలంగా కొత్త రేషన్ కార్డుల కోసం చూస్తున్న వారికి ఇది నిజంగానే శుభవార్త. తెలంగాణలో కొత్తగా రెండున్నర లక్షల కొత్త కార్డులు పంపిణీ చేయనుంది ప్రభుత్వం. అంటే పదకొండున్నర లక్షల మందికి లబ్ధిచేకూరనుంది. ఈ కొత్త రేషన్ కార్డులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో ప్రజలకు అందజేయనున్నారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, మంత్రుల సమక్షంలో పంపిణీ ప్రక్రియ ప్రారంభమవుతుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత జరుగుతున్న అతి పెద్ద కార్డుల పంపిణీ కార్యక్రమం. ఇప్పటి వరకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చింది లేదు.

### మొత్తం 3.14 కోట్ల మంది ప్రజలకు..

పదేళ్ల నుంచి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో ఈసారి భారీగానే దరఖాస్తులు వచ్చాయి. వాటిని జిల్లా స్థాయిలో సమీక్షించి అర్హుల వడపోత చేపట్టారు. అర్హులైన వారికి మాత్రమే రేషన్ కార్డులు ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. తెలంగాణలో నివాసం, ఆదాయ స్థాయి, కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ లింక్ వంటి అంశాలు పరిగణలోకి తీసుకున్నారు. ఇప్పటి వరకు రేషన్ కార్డులపై పురుషుల పేర్లు యజమానులుగా ఉండేవి ఈసారి మాత్రం స్త్రీలను యజమానులుగా చూపిస్తూ కార్డులు తీసుకొస్తున్నారు. కొత్తగా మంజూరు చేసిన రేషన్ కార్డులతో మొత్తం కార్డుల సంఖ్య 94.72 లక్షలకు చేరకోనుంది. మొత్తం 3.14 కోట్ల మంది ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది.






# కోటకు కన్నీటి నివాళి



తెలుగు సినీ పరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాసరావు (83) ఈ తెల్లవారుజామున 4 గంటలకు కన్నుమూశారు. కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, ఆదివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. కృష్ణా జిల్లా కంకిపాడులో 1942 జూలై 10న జన్మించిన కోట శ్రీనివాసరావు, 1978లో 'ప్రాణం ఖరీదు' చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేశారు. తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో సుమారు 750కి పైగా చిత్రాల్లో నటించారు.

## తొలి ఛాన్స్ ఎలా వచ్చిందంటే..

'ప్రాణం ఖరీదు' (1978) సినిమాలో రావు గోపాలరావుగారు ప్రధాన పాత్రకు ఎంపిక అయ్యారు. అప్పటికే 'ప్రాణం ఖరీదు' నాటకం ప్రజల్లో ఆదరణ ఉంది. అందులో కోట నటించారు. ఆ నాటకాన్ని నిర్మాత వాసు, దర్శకుడు క్రాంతి కుమార్ చూసి సినిమా తీయాలనుకున్నారు. ఆ నాటిక రాసిన సీ.ఎస్.రావుగారే సినిమాకి కూడా రచయిత. ఆయనకు కోట అంటే చాలా సెంటిమెంట్ ఉండేది. దీంతో 'ప్రాణం ఖరీదు'లో చిన్న వేషం ఉంది.. చేయాలని కోరారు. అలా కోట ప్రయాణం మొదలైంది. అయితే, ఈ సినిమా తర్వాత ఆయన సుమారు ఐదేళ్లు గ్యాప్ తీసుకున్నారు. హైదాబాద్‌లోని స్టేట్‌బ్యాంకులో మంచి ఉద్యోగం ఉండటంతో కుటుంబాన్ని చూసుకుంటూ ఉండేవారు. జంధ్యాలగారితో ఉన్న పరిచయం వల్ల అమరజీవి (1983) చిత్రంలో నటించారు. అదే ఏడాదిలో విజయశాంతి ప్రతిఘటనలో ఛాన్స్ వచ్చింది. 1985లో విడుదలైన ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ అయింది. ఆ రాత్రికి రాత్రి కోట స్టార్ అయిపోయారు. ఆయనకు వరుసగా భారీ ఆఫర్లు రావడంతో 1986లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తిగా సినిమాలకే పరిమితం అయ్యారు.

## పరభాషల్లోనూ పాగా

తెలుగులో దాదాపు 750 చిత్రాలకు పైగా వరకు నటించి తెలుగు నాట చెరిగిపోని ముద్ర వేశారు కోట. ఇతర భాషల్లోనూ నటించి అక్కడా తన ప్రతిభను చాటుకున్నారు. తమిళం, కన్నడం, హిందీ, మలయాళం సినిమాల్లో నటించారాయన. 'సర్కార్' సినిమాలో సెల్వర్ మణిగా నటించి అమితాబ్ ప్రశంసలు అందుకున్నారు. 'డార్లింగ్', 'రక్త చరిత్ర', 'భాఘీ' లాంటి పలు బాలీవుడ్ సినిమాలతో అక్కడా ఆకట్టుకున్నారు. 'సామి' సినిమాతో తమిళంలోకి ఎంట్రీ ఇచ్చిన ఆయన అక్కడ దాదాపు సుమారు 30 చిత్రాల్లో చేశారు. 'తిరుపాచి', 'పరమశివన్', 'కో', 'అరణ్మని' లాంటి చిత్రాల్లో చేసిన పాత్రలతో అక్కడా మంచి గుర్తింపు వచ్చింది. మలయాళంలో 'ది ట్రైన్', కన్నడంలో 'రక్త కన్నీరు', 'లవ్', 'నమ్మ బసవ'లో చేశారు.



మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్
14-07-2025
WWW.MAHAADAILY.COM














## ముగిసిన కోట శ్రీనివాసరావు అంత్యక్రియలు

ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాసరావు పార్థివ దేహానికి ఫిల్మ్‌నగర్‌లోని నివాసంలో కుటుంబ సభ్యులు, అభిమానులు, సినీ రాజకీయ ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఫిల్మ్‌నగర్‌లోని నివాసం నుంచి జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానం వరకు కోట శ్రీనివాస రావు అంతిమయాత్ర కొనసాగింది. అనంతరం మహాప్రస్థానంలో కుటుంబసభ్యులు, ప్రముఖుల సమక్షంలో కోట శ్రీనివాస రావు అంత్యక్రియలు ముగిశాయి. కోట శ్రీనివాస రావుకు ఆయన మనవడు శ్రీనివాస్ అంతిమ సంస్కారాలు పూర్తి చేశాడు. అంతకుముందు తమ అభిమాన నటుడు కోట శ్రీనివాస రావును కడసారి చూపు చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో అంతిమయాత్రలో పాల్గొన్నారు.

## కోట శ్రీనివాసరావు మొదటి, చివరి సినిమాలివే..

83 ఏళ్ల వయసులో కోట శ్రీనివాసరావు మరణ వార్తతో ఇండస్ట్రీ తీవ్ర విచారం వ్యక్తం చేస్తోంది. గత మూడేళ్లుగా వృద్ధాప్య సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన నేడు (జులై 13న) తుది శ్వాస విడిచారు. కోట సినీ ప్రస్థానం మొదలు నుంచి చివరివరకు ఎన్నో విశేషాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆయన నటించిన మొదటి మరియు చివరి సినిమా విశేషత సంతరించుకుంది. కోట శ్రీనివాసరావు మొదటి సినిమా 1978లో వచ్చిన ప్రాణం ఖరీదు. చిరంజీవి మొదటి సినిమా కూడా ఇదే. ప్రాణం ఖరీదు' చిత్రంతో ఆయన తాను ఒకేసారి సినిమా కెరీర్ ప్రారంభించామని గుర్తు చేశారు కూడా చిరు. ఈ క్రమంలోనే కోట శ్రీనివాసరావు నటించిన చివరి సినిమా ఆసక్తికరంగా మారింది. కోట శ్రీనివాస రావు చివరగా పవన్ కల్యాణ్ హరిహర వీరమల్లులో నటించారు. ఈ విషయాన్ని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కోట వెల్లడించారు. పీరియడ్ డ్రామా వీరమల్లు సినిమాలో రెండు రోజులు పాటు షూటింగ్ చేశానని కోట తెలిపారు. అంతేకాకుండా తానూ అనారోగ్యంగా ఉన్నప్పటికీ.. కేవలం పవన్ కోసమే నటించినట్లు చెప్పారు. ఇపుడీ ఈ విషయం వైరల్ అవుతుండటంతో మెగా ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మెగా అన్నయ్యలతో కోట నటప్రస్థానం ఎప్పటికీ సుపరిచితం అని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. మరి, ఈ సినిమాలో కోట ఎలాంటి పాత్రలో నటించనున్నారనేది ఆసక్తిగా మారింది. అయితే, హరి హర వీరమల్లు మూవీ జూలై 31న విడుదల కానుంది. ఇకపోతే.. కోట శ్రీనివాసరావు తన 40 ఏళ్ల సినీ కెరీర్ లో తెలుగు ,హిందీ, కన్నడ,మలయాళంలో మొత్తం750కి పైగా సినిమాల్లో నటించారు. విలన్, కమోడియన్, తండ్రిగా ఇలా ఎన్నో రకాల పాత్రలకు ఆయన జీవం పోశారు. విలక్షణ నటుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన నటనకు గానూ 9 నంది అవార్డులు, ఒక సైమా అవార్డు గెలుచుకున్నారు. 2015లో కేంద్రప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో కోటని సత్కరించింది.















మహా పత్రిక
తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 14-07-2025


# విస్మృత కవి కొండా యల్లాదాసు



డా. సంగిశెట్టి శ్రీనివాస్
98492 20321

1934లో ప్రచురితమైన గోలకొండ కవుల సంచికలోని కవుల గురించి ఆ తర్వాతి కాలంలో మహబూబ్నగర్, వరంగల్, కరీంనగర్ జిల్లాల పండితులు తమ ప్రాంతం వారిపై పరిశోధన చేసి, విమర్శనాత్మక వ్యాసాలు రాసింద్రు. పుస్తకాలు ప్రచురించారు. విడివిడిగా ఆ ప్రాంత కవుల ప్రతిభను వెలుగులోకి తెచ్చినారు. దీంతో కొంతమేరకైనా ఆ జిల్లాల వారి ప్రాచీన సాహిత్యం చరిత్రకెక్కింది. అయితే మిగతా జిల్లాలు ముఖ్యంగా హైదరాబాద్, మెదక్ విషయంలో ఈ కొనసాగింపు ఇంకా బాకీ ఉన్నది. ఓగేటి అచ్యుత రామశాస్త్రి 'హైదరాబాద్ నగర భాషా సాహిత్య వికాస చరిత్ర' పేరిట ఒక ప్రయత్నం చేసింది. ఇది ఆయన పిహెచ్డీ పరిశోధక గ్రంథం. అయినా అందులో చాలా మంది కవులకు సంబంధించి గోలకొండ కవుల సంచికకు మించి కొత్త విషయాలు జోడించినదేమీ లేదు. ఆ కవులు, రచయితలు బీసీలయితే కనీస పట్టింపు కూడా లేదు. ఇట్లాంటి విస్మృత కవి, పండితుడు కొండా యల్లాదాసు (18261903). పద్మశాలి కులోద్భవుండు.

మెదక్ జిల్లా సిద్దిపేట తాలూకా రామక్కపేటకు చెందిన యల్లాదాసు పూర్వీకులు సన్నని వస్త్రములు నేయుటలో నేర్పరులు. వీరి పనితనాన్ని మెచ్చుకొని దుబ్బాక సంస్థానాధీశులు వీరికి ఒక మామిడి తోటను జాగీరుగా యిచ్చారు. దీంతో ఈ తోట కొండావారి తోటగా ప్రసిద్ధికెక్కింది. ఈ కుటుంబం మొత్తం యల్లాదాసు పుట్టుకకు పూర్వమే అంటే 1826కు పూర్వమే హైదరాబాద్లోని హనుమాన్ టేక్డీలో నివాసం ఏర్పర్చుకున్నారు. హైదరాబాద్లోనే పుట్టిన యల్లాదాసు సుందరకాండము పేరిట రామాయణాన్ని రాసిండు. ఇది ముద్రితము. (1934 నాటికి). అట్లాగే దశరథరామశతకము, ఆధ్యాత్మిక కీర్తనలు, పద్యాలు అనేకం రాసిండు.

యల్లాదాసు చిన్నతనము నుంచి తెలుగులో అక్షరములు గుండ్రముగా రాయడము నేర్చుకున్నాడు. దీనితో కొన్ని రోజులు ఒక షాహుకారు దగ్గర గుమాస్తాగా పనిచేసిండు. చిన్నప్పుడు గురువులు అముదాల వెంకటశాస్త్రుల వద్ద విద్యాభ్యాసం చేసిండు. ఆయన శిక్షణలో పద్యాలు రాయడం అలవరుచుకున్నాడు. యల్లాదాసు రాసిన గీర్వాణ పారాయణ గ్రంథము ప్రచురితమయింది. అయితే దశరథరామ శతకము, శ్రీరామ కీర్తనలు 1934 నాటికి ముద్రితము కాలేదని గోలకొండ కవుల సంచికలో పేర్కొన్నారు.

కొండా యల్లదాసు తల్లిదండ్రులు యల్లమాంబ, రామయ్యలు. ఈయనకు వెంకన్న అనే సోదరుడున్నాడు. యల్లదాసు అనేక తీర్థయాత్రలు చేసి అదే భక్తి పారవశ్యముతో తాను కూడా కీర్తనలు రాసిండు. 77 ఏండ్లు బతికి 1903లో చనిపోయిన యల్లాదాసు పద్యాలు మూడు మాత్రము గోలకొండ కవుల సంచికలో పేర్కొన్నారు. దాని శీర్షిక 'దశరథరామా'. వీటికి నేను సేకరించిన పద్యాలు, కీర్తనలు జోడిస్తున్నాను. ఈ కీర్తనలు 1939లో ప్రచురితమైన 'పద్మశాలి మహాపురుషుల చరిత్ర' పుస్తకంలో పెండెం వెంకట్రాములు పేర్కొన్నారు. అవి ఇలా ఉన్నాయి.

"క. శ్రీ రవికుల సుత్రామా
సూరిజన స్తోమవినుత సురచిరనామా
చారుల సద్గుణధామా
దారుణ సంగ్రామ భీమ దశరథరామా

క. బహుభంగుల నిను వేడిన
గుహనకునిడినావు గావె కోర్కుల నెల్లన్
సహజనము నీకిది రిపువన
దహనా సీతాభిరామ దశరథ రామా

క. జానకి చెంగట లేదా
పూనిక భక్తులను బ్రోవ బోధింపద యో
మాని తగుణ గణ వినరా
దా నా మొఱ వీనులార దశరథ రామా

క. ఆక్షీణ పపుణ్య నీకు బ్ర
దక్షణ మొనరింతు భక్త తతి సంత్రాతా
వీక్షింపు ముదముతో నను
దాక్షిణ్యము కీర్తికరము దశరథరామా

క. హరి! పరమేశ్వర! దామో
దర! మాధవ! వాసుదేవ! దనుజాంతక! శ్రీ
ధర సురవందిత! ధరణీ
ధర! మ్రొక్కెద శిరము వంచి దశరథ రామా

క. విను కొండవారి వంశం
బున రామయ యల్లమాంబ పుత్రులలో వె
కన యగ్రజన్ముడయ్యెను
ధనర గనిష్టుండ నేను దశరథరామా

క. కొండా యల్లయ్యను దా
సుండను కందముల చేత శోభితమౌ పూ
దండ సమర్పించితి మా
ర్తాండ కులేశ్వర ధరింపు దశరథరామా

పద్యములు

మ. భువిలో నస్థిరవస్తు సంఘములు గోబుద్ధిన్
విచారించు దా
యువతుల్ నూనులు బంధువర్గములు
శ్రీయోపాయముల్
వస్తువుల్ నవి శేషంబగు మేను
మందిరములున్ సంసారముల్
గాన శ్రీధవు నారాయణ రామకృష్ణ యనిన్
ధన్యాత్ము లౌటొప్పదే

కీర్తన

ఎవరి సేవింతు శ్రీరామా! నే
నెవరి వాడను భక్తకామా॥
భువన వందిత నీ పదంబులు
తవిలి కొలిచిన దాస జనముల
సవిరళంబుగ బ్రోచితిని మున్నని
జనులందు రధికల్లోకో
॥ఎవ॥
పాత కుడనో నేను దేవ। నీకు
చేతగాదొకో పన్ను గావ॥

త కంబులు చెర చిపతితులు
పావనంబుగ జేతునని ముని ఖ్యాతి
జేసితి వంతెనొక్కటి భూతలంబున
గాన నిజముగ
॥పాత॥
ఉల్లములో నమ్మియున్న కొండా
యల్లదాసుని బ్రోవుమన్న
ఎల్ల లోకము లెరుగ జానకి
వల్లభా నీదాస దాసుడ వల్లవా
నావాడు నీడన జెల్ల
దాసీ తామనో వల్లభా ॥ఉల్ల॥

కీర్తన

తడవు జేయలేవిక నెనెవ్వడ ననుకున్నావు।
నెవ్వడననుకున్నావు
ఘడియలోన నామనవి వినక నీవడుగు దాట
దంట దాసుడు వీడు యనుచు నీ వెంటనేమో
యె। వెంటబడిన
విడువక కోపము వుంటే మానాయ॥
కౌసల్యాదులు యిది యేమని నను
కసురుకుంటే నేమి। నానుడు
వీడా దుష్టుడనుచు మీద దశరథుడుంటే
నేమి॥
బందు వీడుయని కైకసుమిత్రలు పలుక
నిమ్ము కొండ యల్లనా
దాసుడ నేనని కోరియుంటి నిన్ను॥

దాదాపు 150 ఏండ్ల క్రితమే సరళ సుబోధకంగా 'దశరథరామా' అనే మకుటంతో శతకం రాయడమే గాకుండా సంస్కృతంలోనూ రచనలు చేసిన కొండా యల్లదాసు వంశస్తులు హైదరాబాద్లో ఉండే అవకాశమున్నది. 1903లో చనిపోయాడంటే ఆయన ఫోటో ఉండేందుకు అవకాశమున్నది. 1903లో మృతి చెందిన వ్యక్తికి సంబంధించిన సమాచారము కుప్తంగానే అయినా గోలకొండ కవుల సంచికలో చోటు చేసుకున్నది. ఇప్పుడు యల్లాదాసు ముద్రితాముద్రిత రచనలు సేకరించి అచ్చు వేయాల్సిన అవసరమున్నది. బీసీలు వందల ఏండ్లుగా సృజిస్తున్న సాహిత్యానికి గౌరవం, గుర్తింపు తీసుకు రావాలి.

# మనోరంజనం



పిల్లల కథ



- పైడిమర్రి రామకృష్ణ, 2475646

అనగనగా ఒక అడవిలో ఓ కోతి ఉండేది. పక్కనే ఉన్న గ్రామంలోని వేషగాడి వద్ద పెరిగి అడవికి వచ్చింది.ప్రతిరోజు ఓ పేద్ద మర్రి చెట్టు కింద ఎత్తైన బండమీద ఓ జంతువులా వేషం వేసుకుని ప్రదర్శించేది.ఒకరోజు ఎలుగుబంటి, మరో రోజు నక్క,ఇంకోరోజు ఏనుగు వలె వేషం కట్టేది.అంతే కాదు వేషానికి తగ్గట్టు అనుకరించి జంతువులని పక్షులను ఆకట్టుకునేది.ప్రదర్శనకు మెచ్చి తోటి జంతువులు దానికి రకరకాల పండ్లు, తేనె పట్టులు,దుంపలు కానుకగా యిచ్చేవి.ఈ విషయం అడవిని పాలించే మృగరాజు సింహానికి తెలిసింది. మృగరాజు తన చిట్టికూన పుట్టినరోజు వేడుకకు కోతితో ప్రదర్శన ఏర్పాటు చేయించాడు. కోతి రకరకాల జంతువుల వేషాలు వేసి, వాటిలా నటించి చూపింది.చివరిగా మృగరాజు వేషం కట్టింది.అలానే అనుకరించి చూపింది.జీ వులన్నీ చప్పట్లు కొట్టి అభినందించాయి.మృగరాజు కోతి ప్రదర్శనకు మెచ్చి విలువైన కానుకలిచ్చి, అభినందించి పంపాడు.దాంతో కోతికి గర్వం పెరిగింది. అది నక్కలా వేషం వేసి కోడి,బాతు, కుందేలు వంటి పక్షులను, జంతువులను భయపెట్టి పరుగు పెట్టించేది.వద్దని ఎంత చెప్పినా వినకపోయేది.దాంతో మృగరాజుకు ఫిర్యాదు చేశాయి.మృగరాజు కళను మనోరంజనానికి, వినోదానికి ఉపయోగించాలే కానీ, ఇలా తోటి జంతువులను భయపెట్టకూడదని హెచ్చరించి పంపాడు.కానీ కోతి మృగరాజు మాటలు పెడచెవినపెట్టింది.ఒకరోజు పులిలా వేషంకట్టింది. పులిలా నటిస్తూ జింక, నక్క,తోడేలులను పరుగు పెట్టించింది."పదండిరో సింహం.!!".అంటూ పరుగు పెట్టాయి.అటుగా అప్పుడే వచ్చిన మృగరాజు, పులివేషంలో ఉన్నకోతి పై పంజా విసిరాడు.కోతి తప్పంచుకుని ఎగిరి చెట్టెక్కింది.గజగజా వణుకుతూ "ప్రభూ ! నేను కోతిని... పులినికాదు !!నన్ను మన్నించండీ !ఇంకోసారి సరదాకు కూడా ఇలా కళను దుర్వినియోగం చేయను!"అని లెంపలేసుకుని, గుంజీలు తీసింది. మృగరాజు క్షమించి అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

## ఇంద్రగంటి శ్రీకాంత శర్మ పురస్కారం-2025



2025వ సంవత్సరానికి 'ఇంద్రగంటి శ్రీకాంత శర్మ సాహితీ పురస్కారం' ప్రముఖ కవి శ్రీ విన్నకోట రవి శంకర్ గారికి ఇవ్వడానికి అవార్డు కమిటీ నిర్ణయించింది. 2020లో ప్రారంభించబడిన ఈ పురస్కారం ఇప్పటివరకు ఐదుగురు ప్రముఖ తెలుగు కవులు, కవయిత్రులని సత్కరించింది. శ్రీ రవి శంకర్ ఆరవ గ్రహీత.

'కుండీలో మర్రి చెట్టు', 'రెండో పాత్ర', 'వేసవి వాన', 'మంచు కరిగాక' లాంటి రచనల్లో శ్రీ రవి శంకర్ గారి గాఢమైన మానవతా దృష్టి, సాధారణ ప్రపంచంలో మనకి గోచరించని అసాధారణ సత్యాలని అత్యంత సరళమైన భాషలో ప్రకటించ గలిగే ప్రతిభ, తాత్విక దృష్టి ఆయన ఎంపికకు ప్రధాన కారణాలని పురస్కార కమిటీ సభ్యులు తెలిపారు.

**అవార్డు ప్రదానోత్సవ తేదీ, వేదికల వివరాలు కమిటీ తరువాత తెలియజేస్తుంది.**

## భీమకవి చోడగిరిచంద్ర రావు సమగ్ర కవిత్వం ఆవిష్కరణ




కోయి కోటేశ్వరరావు సంపాదకత్వం వహించిన 'భీమకవి' చోడ గిరిచంద్ర రావు సమగ్ర కవిత్వం ఆవిష్కరణ సభ జూలై 20 వతేది ఆదివారం ఉదయం10 గం. లకు యూ.టి.ఎఫ్ బిల్డింగ్, కాకినాడలో జరుగుతుంది. నేలపూడి బాలరాజు అధ్యక్షత వహించే సభలో పొనుగుమట్ల విష్ణుమూర్తి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు . ముఖ్య అతిథిగా కోరుకొండ బాబ్జీ ,విశిష్ట అతిథులుగా శిఖామణి , జి లక్ష్మీనరసయ్య ,చోడగిరి లలితాదేవి, బండి సత్యనారాయణ ,కొబ్బరాకు సుధాకర్ ,అద్దేపల్లి ప్రభు ,మాకివీడి సూర్యభాస్కర్, నేలపూడి రత్నజీ తదితరులు అతిథులుగా పాల్గొంటారు. - రాజేష్, సవిలే ఫౌండేషన్, కాకినాడ

## కె.శివారెడ్డి కవిత్వస్ఫూర్తి పురస్కారం-2025 కొరకు
## కవితాసంపుటాల ఆహ్వానం!

ప్రముఖ కవి కె.శివారెడ్డి పేరిట క్రితం సంవత్సరం నుంచి స్ఫూర్తి పురస్కారంఇస్తున్న యువ కవి పురస్కారానికి ఈ ఏడాది కూడా కవితా సంపుటులను ఆహ్వానిస్తున్నట్టు కవి ఇబ్రహీం నిర్గుణ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2022, 2023, 2024 సంవత్సరాలలో ముద్రితమైన కవితాసంపుటాలను మూడుప్రతులు దిగువ చిరునామాకు ఆగష్టు 15, 2025 వ తేదీలోపు పంపించాలని నిర్గుణ్ తెలిపారు. ఇది యువ పురస్కారం కనుక కవి వయస్సు 40 స్వత్సరాలకు కు మించకూడదని ఇబ్రహీం నిర్గుణ్ వివరించారు. పురస్కార గ్రహీతకు నగదు బహుమతి, జ్ఞాపిక అందించి ఘనంగా సత్కరించనున్నట్టు ఇబ్రహీం నిర్గుణ్ ప్రకటించారు. కవితా సంపుటులను పంపవల్సిన చిరునామా :

**ఇబ్రహీం నిర్గుణ్, 15-5-112/1/B,
స్కైలైన్ టవర్స్ ఎదురుగా, చైతన్యనగర్, ఖమ్మం-507002, తెలంగాణ.సెల్:9063696968**

## రచనలకు ఆహ్వానం

**సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..**

**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**
**mahaapatrika@gmail.com**
**whatsapp 9247580946**

## పుస్తక సమీక్షల కోసం...

**తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.**
**43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034.**

# వైవిధ్య భరితమైన కథా సంపుటి






కటుకోజ్వల ఆనందాచారి

కవిగా, విమర్శకుడిగా, వక్తగా, సంపాదకుడిగా ప్రసిద్ధులైన ఆనందాచారి గారు" గస్సాల్ " సంపుటంతో కథకుడిగా మన ముందుకు వచ్చారు. ముస్లిం సమస్యలు, రాజ్యం అణచి వేత, పరాయీకరణ ,మారిపోతున్న కుటుంబ సంబంధాలు వీరి కథల్లో కనిపిస్తాయి.

ఊర్లో ముస్లింలు చనిపోయినప్పుడు వారిని స్నానం చేయించి, శుభ్రపరిచే పనిని చేస్తుంటాడు చాంద్. జనాజేకీ నమాజ్ కు వాళ్లను సిద్ధం చేసే గసాల్ పని గత పాతికేండ్ల నుండి చేస్తున్నాడు. లేకుంటే ఒక్క పంచర్, సైకిల్ రిపేర్ల తోనే అతడు ఇంటిని ఎలా వెళ్ళదీస్తాడు. నెలలో ఒకటి రెండు సార్లు ఈ పని చేయాల్సి వస్తుంది. ఒకరిని శుభ్రం చేసి తయారు చేసి వస్తే ఎంత తక్కువైనా ఇప్పుడు 500 నుండి వారి స్తోమతను బట్టి రెండు మూడు వేల వరకు వస్తాయి. హఠాత్తుగా చాంద్ చనిపోతాడు. ఇంట్లో ఒక్క పైసా లేదు. కనీసంగా ఏడు ఎనిమిది వేలు కావాలి. స్నేహితులు కూడా పేదవాళ్లే, అయినా కొద్దిగా సమకూర్చారు. అల్లుళ్ళు అంతంత మాత్రమే. వాళ్లు కొద్దిగా సర్దారు. ఇంకా డబ్బు కావాలి. వేరే ఎవరైనా గస్సాల్ ను పిలిపిస్తే 1000, 2000 ఇవ్వాలి. పైగా వాడు అందుబాటులో లేడు .ఎంతోమందిని పవిత్రంగా శుభ్రం చేసి, చివరి వీడ్కోలుకు సిద్ధం చేసిన చాంద్ ను శుభ్రం చేయడానికి ఎవరూ లేకుండా పోతారు. అదంతా గమనించిన కూతురు సలీమ, నేనే స్వయంగా నా తండ్రి శరీరాన్ని శుభ్రం చేస్తానని ముందుకు వస్తుంది. దానికి పెద్దలు అభ్యంతర పెట్టడంతో అన్న జావేద్ ను పిలిచి, అతనితో ఆ పని దగ్గరుండి చేయిస్తుంది. తర్వాతనే శవయాత్ర మొదలవుతుంది అని చెబుతూ కథ ముగుస్తుంది. సలీమ, తండ్రి దగ్గరున్న సాన్నిహిత్యంతో శవాన్ని ఎలా శుభ్రపరుస్తారో తెలుసుకున్న విధానాన్ని రచయిత సందర్భోచితంగా పాఠకులకు తెలియజేస్తారు.

ఇస్లామిక్ నియమాల ప్రకారం శవం యొక్క భౌతిక స్థితితో సంబంధం లేకుండా మృతదేహాన్ని కడగడం, శుద్ధి చేయడం, సంప్రదాయబద్ధంగా సిద్ధం చేయడం తప్పనిసరి. ఈ పనులు చేసే వారిని గస్సాల్ అంటారు. చనిపోయిన వ్యక్తికి స్నానం చేయించే నియమాలు, చదవాల్సిన ప్రార్థనలు మరియూ ప్రక్రియ సమయంలో ఉపయోగించవలసిన వస్తువుల గురించి వారికి తెలిసి ఉండాలి. ఈ కథలో ఎవరైనా చనిపోతే నేరుగా గస్సాల్ దగ్గరికి వచ్చి పిలుచుకుపోతుంటారు. నిజానికి అలా ఉండదు. చావు విషయంలో మసీదు దగ్గర ఉన్న ఇమామ్ కు తెలియజేస్తే అతనే గస్సాల్ ను , బొందలు తవ్వే వాళ్లను పురమాయిస్తాడు. ఇస్లామిక్ దేశాలలో అయితే మున్సిపాలిటీలలో తెలియజేస్తే, వారు కొలువులో ఉన్న గస్సాల్ ను పంపిస్తారు. ఈ కథలో తండ్రి శవాన్ని శుభ్రపరచడానికి కూతురు ముందుకు రావడం లో అతినాటకీయత చోటుచేసుకుంది. పురుషాదిక్యత సమాజమైన ఇస్లాంలో అది ఎలా కుదురుతుంది? పైగా మగవాళ్లకు మగవాళ్లు, ఆడవాళ్లకు ఆడవాళ్లే గస్సాల్ పనిచేయాల్సి ఉంటుంది. అందుకని రచయిత సలీమ, అన్నతో దగ్గరుండి చేయించినట్లుగా కథ నడిపించారు. ముఖ్యంగా మహమ్మదీయుల అంత్యక్రియలు, అందులో ప్రధాన పాత్ర వహించే గస్సాల్ ల వృత్తిపరమైన జీవితాన్ని వివరించిన అరుదైన కథగా ఇది నిలిచిపోతుంది. ఈ కథ చదువుతుంటే శవాలంకరణ కూడా ఒక కళగా తీర్చిదిద్దిన జపాన్ కళాకారుల కృషి, సేవ అంకిత భావాన్ని తెలియజేసిన జపానీ చిత్రం " ఒకురిబిటో" జ్ఞాపకం వస్తుంది. "గస్సాల్" పేరుతో వారి జీవనశైలిని, వారిపై కొనసాగే వివక్ష అవమానాలను ఆందోళనలను చిత్రీకరిస్తూ వచ్చిన పది ఎపిసోడ్ల టర్కిష్ టీవీ సీరియల్, ప్రపంచవ్యాప్తంగా సంచలనాన్ని రేకెత్తించి నిషేధానికి గురైంది.

కొత్తగా ప్రభుత్వం పౌరసత్వ చట్ట సవరణ తెచ్చింది. దీనితో మతపరమైన భేదం చూపి కొంతమంది ముస్లింలు దేశ పౌరులే కాదని ప్రకటిస్తూ, ప్రజల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాక వాళ్లకు వ్యతిరేకంగా మాట్లాడిన వాళ్లను, భిన్న అభిప్రాయాలు ఉన్న వాళ్ళను కూడా విదేశీయుల కింద జమ కడుతున్నారు. ఇది చాలా దారుణమని రచయిత" హిందూ సితా హమారా " కథలో తెలియజేస్తారు.. బీదవాళ్లకు, బిచ్చగాళ్లకు కులం, మతం ఏముంటుంది? బిచ్చగాళ్లు ప్రతి గురువారం సాయిబాబా గుడి దగ్గరకు, శుక్రవారం మసీదు దగ్గరకు, ఆదివారం చర్చి వద్దకు వెళ్లి బిచ్చం ఎత్తుకుంటారు. అక్కడకు అన్ని మతాల కు సంబంధించిన బిచ్చగాళ్లు, ఆయా మతాల వేషధారణతో చేరుకొని బిచ్చం అడుక్కుంటారు. ఎందుకు ఇలా అని అడిగితే 'బతుకు సక్కగా గడిచే దారే మాకుంటే ఇన్ని వేషాలు, కథలు ఎందుకు పడతాం చెప్పండి' అని వాళ్ళు మనల్ని ప్రశ్నిస్తారు.

యాంత్రికీకరణ మారుతున్న ప్రజల అభిరుచుల వల్ల కులవృత్తులన్నీ నాశనమైపోయాయి. ఇంకా ఆ వృత్తిని అంటిపెట్టుకున్నవాళ్లు అప్పులు చేసి, అవమానాల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఒక కంసాలి ఉదంతంతో తెలియజేస్తారు. ఫ్యాక్టరీలు, కంపెనీలు, వ్యాపారం, రాకెట్లు, బ్యాలెట్లు ఇవి పెరిగితే ప్రగతి సాధించినట్లేనా? మరి నిరుద్యోగం, ఆకలి చావులు, ఆత్మహత్యలు ,దోపిడీలు దుర్మార్గాలు వీటి సంగతేమిటి అని "ప్రతిస్పందన" కథలో ప్రశ్నిస్తారు. రాజ్యాంగ విలువలు, మానవత్వం అంటూ మాట్లాడే పోలీసు అధికారులు ఉద్యోగ నిర్వహణలో భాగంగా అమాయకులను చిత్రహింసలు పెట్టి చంపడానికి కూడా వెనుకాడరని ఒక కథ తెలియజేస్తుంది.

గిరిజనులకు చదువులు, ఉద్యోగాలు వాళ్లను కుటుంబం నుండి, సమూహం నుండి దూరం చేస్తున్నాయి. పరాయీకరణకు లోనైన తర్వాత వారి కట్టుబాట్లు, వారి ఆచారాలు, సంస్కృతి ఇవన్నీ మోటుగా అనిపిస్తుంటాయి. తరతరాలుగా వస్తున్న కొన్ని సంప్రదాయాలు అనివార్యంగా మారిపోతాయి. కొన్ని అనవసరం అయిన వాటిని వదిలించుకోవాలి కూడా. కానీ ఏవైతే మనిషిని మనిషిగా నిలబెడతావో, మనుషుల మధ్య అనుబంధాలను పెంచుతావో, వాటిని కొనసాగించాలని " లచ్చిమి" నిరూపిస్తుంది. నిరక్షరాస్యురాలైన లక్ష్మి గుర్తించిన విషయాన్ని విద్యాధికులైన ఆమె కొడుకు, కోడలు గుర్తించకపోవడం అసలైన విషాదం. ప్యాకేజీలతో వచ్చిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ల మెదడులను పిండుకోవడం అని ప్రక్రియ కంపెనీలది. బానిసల శ్రమనాటిది. ఆధునిక జ్ఞాన బానిసత్వముగా చెప్పవచ్చునేమో! విజ్ఞాన వెట్టిచాకిరి ఇది. ఎంత చేసినా ఇంకా చేయాల్సిన పని మిగిలే ఉందని, టార్గెట్ పూర్తవలేదని తీవ్రంగా మధన పడిన శృతి ఒత్తిడితో, నిద్రలేమితో, డిప్రెషన్ లోకి పోయి ఆత్మహత్య చేసుకుంటుంది. దీనికి ఎవరు కారణం?

ఉద్యోగం, సంపాదన, పైకి ఎదగడం అందుకోసం వేసే వ్యూహాలు, మాటలు, పథకాలే తప్ప కుటుంబ సంబంధాల విలువలు ఎవరికి తెలుసు. ఇండ్లు, కార్లు, వస్తువులు, సౌకర్యాలు పొందడమే జీవితంగా మారిపోయింది. నిజంగా పొందాల్సిన ప్రేమ, ఆప్యాయతలు, అనుబంధాలు, ఆత్మీయతలు అన్ని అడుక్కు తోసి వేయబడ్డాయి. ముఖ్యంగా కరోనా కాలంలో కుటుంబ సంబంధాలు, మానవ విలువలు అన్ని కొట్టుకుపోయాయన్న సంగతి మనకు తెలిసిందే. కరోనా కాలంలో పారిశుద్ధ్య కార్మికులు తమ ప్రాణాలకు తెగించి తమ విధులను నిర్వహించారు. ఆ విధి నిర్వహణలో తమ ప్రాణాలు కూడా పోగొట్టుకున్నారు. వారు రాకపోతే రాలేదని తిట్టుకున్నారే గాని ఎవరైనా ఏమయ్యాడో అని ఆరా తీశారా? అటు ప్రభుత్వము, ఇటు ప్రజలు పట్టించుకోని మురికి జీవితాలు ఎవరికి కావాలి?

పురుషాధిక్యత జీర్ణించుకుపోయిన శేషు తలలో చాలా ఏళ్లుగా చెత్త ఆలోచనలు పేరుకుపోయాయి. ముందు వాటిని వదిలించుకోవాలి. ఈరోజుకు పనికిరాని ఆలోచనలు, ఆచారాలను ఆ పాత సామాన్ల వాడికి వేసినట్లే వేసేయాలి. లేకుంటే మెదడు అంతా చెత్తతో తుప్పుతో నిండిపోతుంది. ముందు ఆ పని చేయండి. వీటి కోసం ఏ బండ్లు రావు. మీరే పడేయాలి అన్న భార్య మాటలకు శేషు రియలైజ్ కాక తప్పలేదు. డబ్బులు వెచ్చించలేకపోయినా, శ్రమను వెచ్చించకపోయిన మాటను ఖర్చు చేయడానికి వెనుకాడవద్దు. ఎందుకంటే మాటల ఖర్చుతో మనకు పోయేది ఏమీ ఉండదు. మాట్లాడాలి. మనుషులుగా ఉన్నందున మాట ఎప్పుడైనా ఔషధంలా పనిచేస్తుంది. సంజీవనిలా ప్రాణం నిలుపుతుంది. ఒక వయసు వచ్చిన తర్వాత బిగుసుకు పోకుండా అందరితో మాట్లాడుతూ ఉండాలి .అలా బుర్రకు పని కల్పిస్తే అల్జీమర్స్ కు దూరంగా ఉంటారని ఇటీవలే పరిశోధనల్లో తేలింది. పిల్లల భవిష్యత్తు, ఉద్యోగ నిర్వహణలో పడి భార్యను పట్టించుకోలేని వ్యక్తి ,రిటైర్ అయిన తర్వాత ఒంటరితనంతో బాధపడతాడు. భార్య తన ఒంటరితనానికి ఆసరాగా కుక్కపిల్లతో గడిపేస్తూ ఉంటుంది. చివరి క్షణాల్లో కానీ ఆ భర్త తను చేసిన పొరపాటును గుర్తించలేక పోతాడు. ఈ కథలన్నీ కుటుంబ సంబంధాలలో వచ్చిన, వస్తున్న మార్పులను తెలియజేస్తాయి.

విస్తృతమైన వస్తువైవిధ్యం ఈ కథలలో కనబడుతుంది. వస్తువును ఎంపిక చేసుకోవడంలో, నిర్వహణలో, ముగింపులో చేయి తిరిగిన రచయితలా తమ ప్రతిభను ప్రదర్శించగలిగారు. ఒక ట్రెండు కథలు స్కెచ్ లలా తయారైనా, వస్తు దృష్ట్యా వాటి ప్రాముఖ్యత ఏమీ తగ్గలేదు. ముస్లింలపై కథలు రాస్తే వారి సంభాషణలను ఉర్దూలో, లంబాడి కథ రాస్తే వారి డైలాగులను లంబాడి భాషలో ఇవ్వాల్సిన అవసరం లేదు. తెలుగు వాళ్ళ కోసం రాస్తున్నప్పుడు అన్ని తెలుగులోనే ఉంటే బాగుంటుంది. సమకాలీన సమస్యలు సంఘటనలను కథలుగా రూపొందించడంలో రచయిత మంచి శ్రద్ధను కనపరిచారు. రచయితలో ఉన్న అభ్యుదయ దృక్పథం, మానవీయకోణం ఈ కథలలో కూడా కనిపిస్తుంది. ఈ కథలను ఆసక్తికరంగా తీర్చిదిద్దడంలో రచయిత కృషి ప్రశంసనీయం.

- కే పి అశోక్ కుమార్

# ఆత్మహత్య



రెక్కల కింద వాలి
ఆమె ముగిసి పోయింది

ముగింపు బిందువు దగ్గర నిల్చుని
ముగింపు తీరును బట్టే
బతుకు పొడవూ వెడల్పూ
లోతూ చెప్పగలమా

అందరి ప్రపంచానికొచ్చాక
అందులో తనదైన ఒక ప్రపంచాన్ని
నిర్మించుకోవడానికి
ఆమె యత్నించే ఉంటుంది
రెక్కలను విప్పార్చి

కొంతో మిక్కిలో గమించాక
ఏదో మజిలీలో
ఏవో చీకటి మబ్బులు కమ్ముకున్నపుడు
ఇక ముందు ఏమీ లేదని
అనుకున్నాకనే ఆమె ముగింపుకు
వేలాడి వుంటుందా
ఇష్టంగానో అయిష్టంగానో !

మొదలు పిదప
ముగింపుకు ముందు
ఆమె ఎంచుకున్నది
ఏ చూపూ ఏ నడకా
ఏ విరామమూ ఏ మజిలీ
ఏ తోడూ ఏ ఎడమూ
ఏ పలుకూ ఏ చూపూ
ఏ విలువా ఏ తెగువా
ఏ చేతా ఏ రీతీ.. ఏ ఆశా ఏ స్వప్నం
అన్నీ కలిపితేనే ఆమె దారి

ఎంచుకున్న దారి దారంతా
ముగింపుకు దారి తీసిందా
కాక ఒక మలుపు దగ్గర దారి తప్పిందా
కాక ఒక క్షణంలో దారినే మరిచిందా

ముగింపు క్షణాల్లోనే కానీ
అది అంతకు మునుపటి
ఆమె కోట్ల క్షణాల జీవితాన్ని
ఆవిరి చేసింది కదా

ముగింపులో అర్థం లేనందున
బతుకంతా వ్యర్థం అనగలమా

రెక్కల కింద ముగింపును కూడా ఆమె
రెక్క విప్పారడం గానే తలచిందా
ఆ క్షణంలో
కానీ మూడు రెక్కల కింద నిలిచిన ఆ క్షణంలోనే
తన రెండు రెక్కల పటిమను ఆమె
చూసుకుని ఉండి వుంటే
ఒక దారి ఆమెకు కనపడి వుండేదేమో
తననే నమ్ముకున్న, తానే సాదాల్సిన
పసి రెక్కలు గుర్తుకొచ్చినా
అర్థాంతర ముగింపు అర్థరహితమని
ఆమె కూడా అనుకుని వుండేదేమో

స్వేచ్ఛ జీవించడానికే గానీ
దారి నడుమనే
నిష్క్రమించడానికి కాదని
ఆమెకు ఎప్పుడో దారిలో ఎక్కడో
ఎవరో ఒకరు చెప్పి వుంటే
ఎంత బాగుండేది

దారుల్లో అసలు
మనం ఒకరికొకరం ఏం
మాట్లాడుకుంటున్నాం ?

- దర్భశయనం శ్రీనివాసాచార్య
94404 19039

# పాలిటిక్స్ కలుషితమయ్యాయి

- ప్రజాస్వామిక విలువలు మరిచిపోతున్నారు
- సమాజాన్ని మేలుకొలిపే బాధ్యత మీడియాదే
- ఎప్పుడూ నిజాయితీగా ఉంటా.. ఖమ్మం అభివృద్ధే లక్ష్యం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇంట్రెస్టింగ్ కామెంట్స్



**మ్మం, మహా:** మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఖమ్మంలో మంత్రి తుమ్మల మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయాలపై, ప్రజాస్వామ్య వ్యవస్థలపై, సమకాలీన పరిస్థితులపై తన గుండె తల్లిపడే భావాలను వ్యక్తపరిచారు. రాజకీయాలు ఈ రోజుల్లో చాలా కలుషితమయ్యాయని, ప్రజాస్వామిక విలువలు మరిచిపోతున్నారని వ్యాఖ్యానించారు. వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని, అన్నింటినీ గాడిలో పెట్టే బాధ్యత ఇప్పటికీ మీడియాదే అని తుమ్మల స్పష్టం చేశారు. వాటి పక్షపాతాలు, అర్థం లేని ప్రచారాలు తప్ప నిజాలను రాయాల్సిన బాధ్యత మీడియాపై ఉందని మంత్రి వ్యాఖ్యానించారు. కొన్ని పార్టీలు తప్పుడు ప్రచారాలు చేస్తుంటాయని, వాస్తవాలు రాయండి. సమాజం దృష్టితో వార్తలు రాయాలన్నారు.

**ముఖంలోనే నిజం చెప్పే..**

తాను మద్దతిస్తున్న అభివృద్ధిలో ఖమ్మం నియోజక వర్గానికి ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు. తెలంగాణలో ఖమ్మం నంబర్ వన్ స్థానంలో ఉండాలని అభిప్రాయపడ్డారు. రాజమండ్రికి గంటలో చేరేలా ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం జరుగుతోందని, సెప్టెంబర్ నాటికి దానికి సంబంధించిన ప్రణాళికలు పూర్తవుతాయని చెప్పారు. ఖమ్మం పరిధిలోని సాగర్ ఏరియాలో 30,000 ఎకరాల్లో సాగు పంట వేశారని, వాటికి అవసరమైన నీటిని అందించేందుకు గోదావరి నుంచి నీరు తీసుకురావడంపై కృషి చేశానని వెల్లడించారు. అలాగే ఇళ్ల స్థలాల విషయంలో నిబంధనలు పాటిస్తూ ప్రాసెస్ ప్రకారం ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రభుత్వానికి ఎన్ని ఇబ్బందులు ఉన్నా, సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు. అర్హులకు పథకాలు అందేలా చూస్తా అని తుమ్మల హామీ ఇచ్చారు. తాను ఎప్పుడూ నిజాయితీగా ఉంటానని, ముఖంలోనే నిజం చెప్పే అలవాటు తనదని తుమ్మల వ్యాఖ్యానించారు.

# మంత్రికి స్వాగతం పలికిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కి ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ కంది శ్రీనివాస రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఆదివారం పట్టణంలోని మావల బైపాస్ వద్ద పార్టీ శ్రేణులతో కలిసి ఘనస్వాగతం పలికారు.. పూలబొకే అందించి శాలువాతో సత్కరించారు..ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బోథ్ అసెంబ్లీ ఇంచార్జి ఆడె గజేందర్ ,గోక గణేష్ రెడ్డి ,లోక ప్రవీణ్ రెడ్డి , పసుల చంటి, దేరా కృష్ణారెడ్డి, అఖిల్ రెడ్డి తదితరులున్నారు.





## వర్షా కాలంలో వైరల్ జ్వరాలు సోకే
# ప్రమాదం ఉంది

- కార్మిక, ఉపాధి, పరిశ్రమలు, భూగర్భ గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్

**మందమర్రి, మహా :** వర్షాకాలంలో ప్రజలకు వైరల్ జ్వరాలు సోకే ప్రమాదం ఉందని తెలంగాణ రాష్ట్ర కార్మిక, భూగర్భ గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ అన్నారు. ఆదివారం మందమర్రి మున్సిపాలిటీ 23 వార్డుల్లో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందమర్రి పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పరిశుభ్రత తదితరులలో లోపాలు ఉంటే తన దృష్టికి తీసుకురండని ఆయన పిలుపునిచ్చారు. పట్టణ ప్రగతి కొరకు తాను 24 గంటలు పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. వీటిలో ఏమైనా లోపాలు ఉంటే తన దృష్టికి నేరుగా తీసుకురావాలని యువతను కోరారు. నియోజకవర్గంలో పట్టణ, వివిధ గ్రామాలలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తే ఆయా వ్యక్తులను గుర్తించి బ్లాక్‌లిస్ట్ లో పెట్టాలని ఆయన సూచించారు. అలాగే డ్రైనేజీలు క్లియర్ చేయించి, మురుగునీరు నీరు నిలవకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో వివిధ అభివృద్ధి పనులను దక్కించుకున్న గుత్తేదారులు ఆయా పనులలో నిర్లక్ష్యం వహిస్తే వారిని గుర్తించి బ్లాక్ లిస్టులో పెట్టాలని చెప్పారు. ప్రజల అభ్యున్నతి వరకే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అడుగులు వేస్తుందని పేర్కొన్నారు. అంతకుముందు ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు నోముల ఉపేందర్ గౌడ్, సొత్కు సుదర్శన్, మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, దుర్గం నరేష్, ఆకారం రమేష్, పైడిమల్ల నర్సింగ్, పవన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా బోనాల పండగ

**ఆదిలాబాద్, మహా:** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే బోనాల పండుగ సందడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం అంగరంగ వైభవంగా సాగింది. ఎక్కడ చూసినా గ్రామ దేవతలకు బోనాలను సమర్పించేందుకు మహిళలు బారులు దీరారు. బోనాల కుండలను తలపై పెట్టుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించేందుకు కుటుంబ సమేతంగా బయలుదేరారు. ఆషాఢ మాసంలో ఘనంగా నిర్వహించే బోనాల పండగ సందర్భంగా జిల్లాలోని పోచ్చమ్మ తల్లి ఆలయాలలో భక్తజన సందోహం కనిపించింది. పట్టణంలోని అశోక్ రోడ్డులో గల పోచ్చమ్మ తల్లి ఆలయంతో పాటు మహాలక్ష్మి వాడ లోని అమ్మవారి ఆలయంలో బోనాల సందడి నెలకొంది. బోనాలను సమర్పించేందుకు ఆదివారం వేకువజాము నుండే మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తమ పిల్లపాపలు సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకుంటూ ప్రత్యేక పూజలు చేసి బోనాలను సమర్పించుకున్నారు. వాడవాడలా డప్పు చప్పుళ్ల నడుమ బోనాల కుండలతో మహిళలు పోచమ్మ ఆలయాలకు తరలివచ్చారు. పోతరాజుల విన్యాసాలు... బోనాల సమర్పణ కోలాహలంతో ఆలయాల్లో పండగ వాతావరణం నెలకొంది. వర్షాకాలంలో వచ్చే ఆషాఢ మాసం సందర్భంగా బోనాలను సమర్పించుకోవడం తెలంగాణలో ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఆలయాలకు వచ్చే మహిళల తాకిడి పెరగడంతో పోలీసు శాఖ తో పాటు.. పురపాలక సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహిళల కోసం ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేయడంతో సహా.. అశోక్ రోడ్ వద్ద ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించేందుకు తగు చర్యలు తీసుకున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది సైతం ఆలయాల వద్ద పరిశుభ్రత నెలకొనేలా ఎప్పటికపుడు తగు చర్యలు తీసుకున్నారు. ఆషాఢ మాసం బోనాలను పురస్కరించుకొని ఆదిలాబాద్ లోని పురాతన ఆలయమైన మహాలక్ష్మివాడ పోచమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి మహాలక్ష్మి అమ్మవారికి బోనాలను సమర్పించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను చేపట్టారు. అమ్మవారికి బోనాలు సమర్పించి ఆలయ ప్రాంగణంలో నైవేద్యాన్ని స్వీకరించారు.

# బీఆర్ఎస్, బీజేపీ చేసిందేమీ లేదు

- రాజకీయంగా జోగు రామన్న పని అయిపోయింది
- వచ్చే ఎన్నికల్లో పాయల్ శంకర్ ఓటమి ఖాయం
- కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంఛార్జి కంది శ్రీనివాస రెడ్డి
- బీజేపీ నుంచి కాంగ్రెస్ లోకి భారీగా చేరికలు
- సందడిగా మారిన క్యాంపు కార్యాలయం ప్రజాసేవా భవన్




**ఆదిలాబాద్, మహా:** రాష్ట్రంలో గత పదేళ్ల పాలించిన బీఆర్ఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలకు చేసిందేమీ లేదని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంఛార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం జైనథ్ మండలం నిరాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరితో పాటు ఆదిలాబాద్ పట్టణం 13వ వార్డు, 34వ వార్డు నుంచి ప్రజలు పెద్ద ఎత్తున హస్తం పార్టీలో చేరారు. కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజాసేవా భవన్ లో ఈ కార్యక్రమం నిర్వహించగా.. వారికి కంది శ్రీనివాస రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఓటమితో రాజీకయంగా మాజీ మంత్రి జోగు రామన్న పని అయిపోయిందని జోస్యం చెప్పారు. ఒకప్పుడు ఆయన వెంట ఉన్న నాయకులు ప్రస్తుతం ఎవరూ లేరని తెలిపారు. ముగ్గురు, నలుగురు తప్పితే ఎవరూ కనిపించడం లేదని విమర్శించారు. పాయల్ శంకర్ ఎలాంటి వ్యక్తి అనేది అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. ఆయనకు సెటిల్ మెంట్లు, భూ కబ్జాలు చేస్తారనే పేరు ఉందని ఆరోపించారు. ఆయనకు దమ్ముంటే కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి అభివద్ధి చేయాలని సవాల్ విసిరారు. జోగు రామన్న, పాయల్ శంకర్ లు వారి కుటుంబం గురించి ఆలోచిస్తారు తప్పితే ప్రజలకు చేసిందేమీలేదని తెలిపారు. అభివద్ధి అంటే కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిస్తోందని తెలిపారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిందని, రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డులు అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టబోతోందని పేర్కొన్నారు. గత పదేళ్లుగా రేషన్ కార్డుల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసినా ప్రయోజనం లేకపోయిందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో సన్న బియ్యం, ఉద్యోగాలు, రుణమాఫీ, తొమ్మిది రోజుల్లో రూ.9వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిందని గుర్తు చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు 200 యూనిట్ల వరక ఉచిత విద్యుత్తు సౌకర్యం కల్పిస్తోందని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ను కేంద్రం కు పంపితే మోదీ ప్రభుత్వంలో ఉలుకు పలుకు లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో 42 శాతం అమలకు ప్రత్యేక ఆర్డినెన్స్ తెచ్చి గవర్నర్ ఆమోదం కోసం పంపించిందని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూశాయని పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ఆలోచించేది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. ఆ పార్టీల నాయకులను గ్రామాల ప్రజలు నిలదీస్తున్నారని.. కాంగ్రెస్ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిందని మీరేమి ఇచ్చారని ప్రశ్నిస్తున్నారని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం అందరం కలిసికట్టుగా అభ్యర్థుల విజయం కోసం శ్రమిద్దామని పిలుపునిచ్చారు. బీజేపీ నుండి కాంగ్రెస్ లోకి భారీగా చేరడం తో నిరాలలో పార్టీ మరింత బలపడుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు రాని వారు బాధపడకూడదని రెండో జాబితాలో అర్హులైన అందరికి వస్తాయని భరోసా ఇచ్చారు.



## అమ్మవారిని దర్శించుకున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, మహా:** బోనాల పండగ సందర్భంగా ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పురాతన ఆలయాలు పోచ్చమ్మ తల్లి ఆలయం, శ్రీ మహాలక్ష్మి ఆలయాలను ఎస్పీ అఖిల్ మహాజన్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎస్పీని ఘనంగా సత్కరించి ప్రసాదాలు అందజేశారు. జిల్లా ప్రజలకు ఎస్పీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐ సునీల్ ఉన్నారు

# కవితపై మల్లన్న వ్యాఖ్యలు తప్పు

## మల్లన్న ఆఫీస్ పై కవిత అనుచరుల దాడి చట్టవ్యతిరేకం

### రెండింటినీ ఖండించిన పీసీసీ చీఫ్ మహేష్.. బీసీ రిజర్వేషన్లు మా హామీ.. మా ఘనత




**హైదరాబాద్, మహా:** ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు, క్యూ న్యూస్‌పై దాడి ఘటనపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. ఈ రెండింటినీ ఆయన ఖండించారు. ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు గర్హనీయమని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. మహిళలను గౌరవించుకోవడం మన సంప్రదాయం.. కవితపై ఎమ్మెల్సీ మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలు ఖండించాల్సిందే అని ఆయన ఒక ప్రకటనలో చెప్పారు. అలాగే మల్లన్న కార్యాలయంపై దాడి చట్ట వ్యతిరేకం, చట్ట పరిధిలో అందరూ పని చేసుకోవాలని ఆయన సూచించారు. మల్లన్న కార్యాలయంపై దాడి, గన్ మెన్ కాల్పులు జరిపిన అంశాలపై వచ్చిన ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ జరుగుతుందని ఆయన తెలిపారు. బీసీ రిజర్వేషన్లు కాంగ్రెస్ కృషి ఫలితమే అని టీపీసీసీ స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో ఇతరులు లబ్ధి పొందాలని చూడడం సమంజసం కాదని ఆయన చెప్పుకొచ్చారు.

# మల్లన్నకు బీఆర్ఎస్ వార్నింగ్

## కవితకి క్షమాపణ చెప్పాలని డిమాండ్

### మండలి బిఆర్ఎస్ పక్షనేత మధుసూధనాచారి పోస్ట్



**మహా:** ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న జాగృతి నాయకురాలు కవితపై చేసిన వ్యాఖ్యల పట్ల బీఆర్ఎస్ పార్టీ స్పందించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆ పార్టీ ఖండించింది. ఈమేరకు ఆ పార్టీ అధికారిక ఎక్స్ అకౌంట్‌లో శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి పోస్ట్ చేశారు. మహిళల గౌరవాన్ని కాపాడటం మన సంస్కృతి. వ్యక్తిగత దూషణలు, మహిళలను కించపరిచే వ్యాఖ్యలకు రాజకీయాల్లో చోటు లేదని అందులో పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులు మాట్లాడే భాష మహిళలను కించపరిచేలా ఉండడం తగదు. ఆడబిడ్డల గురించి మాట్లాడేటప్పుడు సోయితో మాట్లాడితే మంచిదని సిరికొండ మధుసూదనాచారి హెచ్చరించారు. తీన్మార్ మల్లన్న వెంటనే ఎమ్మెల్సీ కవితకి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## కొడుకు, కోడలిపై పోలీసులకి ఫిర్యాదు చేసిన తల్లితండ్రులు




**మహా,మిర్యాలగూడ:** తన పెద్ద కుమారుడు శ్రీనివాస్ రెడ్డి, కోడలు మణియమ్మ, వాళ్ల కొడుకు సందీప్ రెడ్డిలు కుట్రపూరితంగా దుర్భశలాడుతున్నారని, మానసికంగా వేధిస్తున్నారని, దాడి చేశారని చర్యలు తీసుకోవాలని స్థానిక డిఎస్పి రాజశేఖరరాజుకు ఆదివారం నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన దగినేపల్లి అనసూర్యమ్మ, బుచ్చిరెడ్డిలు ఫిర్యాదు చేశారు. కుమారులు ఇద్దరికి ఒక్కొకరి 3ఎకరాల 10 గుంటల భూమి చొప్పున పంచి ఇచ్చి ఇద్దరికి రిజిస్టేషన్ చేశామన్నారు. మిగిలిన 3 ఎకరాల 11 గుంటల భూమిని తమ ఆరోగ్యం, పోషణ నిమిత్తం ఉంచుకున్నామన్నారు. నా ఇద్దరు కుమారులు నన్ను నానా బాధలు పెట్టడం చూసుకోకపోవడంతో నా చిన్న కుమారుడి కొడుకు దిలిప్ రెడ్డి వద్ద మేం ఉంటున్నామన్నారు. మనవడు దిలిప్ రెడ్డి చూసుకోవడంతో మాకు నమ్మకం కుదిరి మా భాగానికి ఉన్న భూమిని మనవడికి రిడిస్ట్రేషన్ చేయడంతో నచ్చని నా కుమారుడు శ్రీనివాస్ రెడ్డి, కోడలు మణిమలు మనసులో పెట్టుకొని కుమారుడయిన సందీప్ రెడ్డితో కలసి గతంలో వృద్ధులమైన మాపై విచక్షణరహితంగా దాడి చేశారన్నారు. సోషల్ మీడియా, వీడియో వైరల్ కావడంలో అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేసిన విషయాన్ని మరచి పోకుండా తరచూ మాపై కుట్ర పూరితంగా, మానసికంగా వేదింపులకు గురి చేస్తు ఆదివారం ఉదయం 7:30గంటలకు నా మనవడికి రిజిస్ట్రేషన్ చేసిన భూమిలో దున్నూకుంటు ఉంటే పెద్ద కొడుకు, కోడలు అడ్డం వచ్చి దుర్భశలాడుతూ దాడికి దిగారనీ, చేయి చేసుకోబోయారని వృద్ధ తల్లి దండ్రులు పేర్కొన్నారు. వారి నుండి తమకు రక్షణ కల్పించాలని, న్యాయం చేయాలని వారు కోరారు. దీని ప్రతులను రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, డీజిపి, జిల్లా ఎస్పీకి సమర్పించినట్టు తెలిపారు.

# ప్రభుత్వం ఆదివాసులకు అండగా ఉంటుంది

## కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్, మహా:** ఆదివాసీలకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం కలెక్టర్ చౌక్ సమీపంలో ఆదివాసీ భవన నిర్మాణానికి ఆయన డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపూ రావులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. నియోజక వర్గానికి మంజూరైన ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా ఈ భవన నిర్మాణం చేపడుతున్నట్టు వివరించారు. వీలైనంత త్వరగా భవన నిర్మాణం పూర్తి చేసేలా కృషి చేస్తామన్నారు. నియోజక వర్గ అభివృద్ధికి నిధులిచ్చి ప్రోత్సహిస్తున్న ప్రభుత్వానికి మంజూరు చేయించడంలో కృషి చేస్తున్న మంత్రి సీతక్క, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇతర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. వారి సహకారంతో నియోజక వర్గానికి మరిన్ని నిధులు తీసుకురావడంలో తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు.



# యూనివర్సిటీ భూములు కాపాడండి

## జస్టిస్ చంద్రకుమార్ కు విద్యార్థి సంఘాలు వినతిపత్రం అందజేత

**హన్మకొండ మహా;** కాకతీయ యూనివర్సిటి భూములను కాపాడాలని, యూనివర్సిటీ భూములలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపట్టవద్దని కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీ కి భవిష్యత్తులో మరిన్ని కోర్సులు అందుబాటులోకి వస్తాయని వాటికీ అనుగుణంగా భవనాలు, విద్యార్థులకు సరిపడా హాస్టల్స్, నూతన ఆవిష్కరణల కోసం రీసెర్చ్ సెంటర్లు, అధ్యయన కేంద్రాలు చాలా వరకు భూములు అవసరం పడతాయి కావున ఏదైతే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలు నిర్మాణం కోసం యూనివర్సిటీ పాలకమండలి 15 ఎకరాలను కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని



భవిష్యత్తు యూనివర్సిటీ అవసరాల దృష్ట్యా రెసిడెన్షియల్ స్కూల్ ను ఇతర ప్రభుత్వ భూములలో నిర్మాణం చేపట్టాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, డిఎస్‌ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, పిడిఎస్యు ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, ఎస్ఎస్ యు జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయికుమార్, ఏఐడీఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్ లతోపాటు విద్యార్థి సంఘ నాయకులు ఉప్పుల శివ, రాజు, చెట్టుపల్లి శివ కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి సంరక్షించాలి

## ఎఫ్ఆర్ఓ గులాబ్ సింగ్

**ఆదిలాబాద్, మహా:** మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎఫ్ఆర్ఓ గులాబ్ సింగ్ కోరారు. ఆదివారం వనమహోత్సవంలో మహాలక్ష్మీ వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ కింగ్స్ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్లబ్ సభ్యులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా గులాబ్ సింగ్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములయ్యేల పెద్ద మొక్కలు నాటాలన్నారు. మొక్కల పెంపకంపై అవగాహన కల్పించేల ప్రభుత్వం వనమహోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అతివృష్టి, అనావృష్టితో నష్టాలు కలుగుతున్నాయన్నారు. వృక్షాలుంటే వాటిని కొంత మేరకు నివరించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం లో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మంద అశోక్, కార్యదర్శి భగవాన్ దాస్, కోశాధికారి బుక గంగయ్య, ప్రకాష్ కాలేవార్, మధుసూదన్,పుప్పాల నరేందర్,బెజ్జంకి రవీంద్ర, సత్యనారాయణ, బండారి దేవన్న పాల్గొన్నారు.

# విద్యతోనే సమాజంలో గుర్తింపు

## రాష్ట్ర మంత్రి డా.వివేక్ వెంకటస్వామి

**ఆదిలాబాద్, మహా:** విద్యతోనే విలువలు అలవడుతాయని.. సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి డా.వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదిలాబాద్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన డా.బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆదివారం విగ్రహాదాతలు కాటిపెల్లి వసంత్రెడ్డి, కాటిపెల్లి శ్రీనివాస్ రెడ్డి, పాటు ప్రజాప్రతినిధులతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు సుంకిడి గ్రామంలో నిర్వహించిన బోనాల పండగలో పాల్గొన్నారు. అనంతరం తలమడుగులో దళిత సంఘాల నాయకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ డా.బీ.ఆర్ అంబేద్కర్ అనేక ఇబ్బందులు ఎదుర్కొని కష్టపడి చదివి భారత రాజ్యాంగాన్ని రచించారని గుర్తుచేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత బాబాసాహెబికే దక్కుతుందని తెలిపారు. ముందుచూపుతో రిజర్వ్ బ్యాంకు ఏర్పాటుకు కృషి చేశారని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు అంబేద్కర్ను పొగుడుతున్నాయని వివరించారు. అన్ని కులాలు, మతాలు కలిసిమెలిసి ఉండటం రాజ్యాంగం గొప్పతనమేనన్నారు. అనంతరం ఎంపీ గోడం నగేష్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

# నూతన కాలనీలకు మిషన్ భగీరథ మంచినీరు - ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్‌చేరు మహా:** పటాన్ చేరు నియోజకవర్గం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలకు సైతం ఇంటింటికి రక్షిత మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని నవ్య కాలనీలో మిషన్ భగీరథ ద్వారా ఏర్పాటు చేసిన ఇంటింటికి మంచినీటి నల్ల కనెక్షన్లను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అమీన్పూర్ అంటేనే మంచినీటి కొరతకు కేరాఫ్ అడ్రస్ గా నిలిచేదని.. గత దశాబ్ద కాలంగా ప్రణాళిక బద్ధంగా నూతన రిజర్వాయర్లు నిర్మిస్తూ ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందిస్తున్నామని తెలిపారు. త్వరలోనే బంధం కొమ్ము రిజర్వాయర్ సైతం ప్రారంభిస్తామని తెలిపారు. మంచినీటి కొరత ఏర్పడకుండా ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, హెచ్ఎమ్‌డబ్ల్యూఎస్ డీజీఎం చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



# ఆషాఢ మాసం.. ముహూర్తా ల్లేవని..
# ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభ ముహూర్తాలకు బ్రేక్

- పైలట్ గ్రామాలలోనూ పూర్తిగా ప్రారంభం కాని నిర్మాణం పనులు
- ఇతర గ్రామాలలో ఆశావాహుల ఎదురుచూపులు
- పైలట్ గ్రామాలలో మాత్రమే లబ్ధిదారులకు ప్రొసిడింగ్స్ పంపిణీ



**కాటారం, మహా :** భూపాలపల్లి జిల్లాలో ఇందిరమ్మ జిల్లా పథకంలో సగం మంది మాత్రమే ఇళ్ళ పనులు ప్రారంభించారు. ముహూర్తాలు లేవని కొందరు ఆషాడం మాసం ఆటంకమని మరికొందరు పొలం పనులు కావడంతో ఇంకొంతమంది ఆసక్తి చూపడం లేదు తనకు ఇల్లు మంజూర అయిందని ఆషాడం మాసం కావడంతోనే ఇల్లు పనులు ప్రారంభించడం లేదని లబ్ధిదారులు అంటున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కాటారం సబ్ డివిజన్లో పూర్తి నత్తనడక గా ఉంది. పైలట్ ప్రాజెక్టు గా ఎంపిక చేసిన గ్రామాలలో సైతం పూర్తిస్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. ఆషాఢ మాసం కావడంతో ఇల్లని ర్మాణాల కోసం భూమి పూజ జరగడంలో లబ్ధిదారులు వెనుక వెనుకంజ వేస్తున్నారు. ప్రారంభమైన చోట పెట్టుబడి సాయం లేక పూర్తిస్థాయిలో పనులు జరగడం లేదు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన కాటారం మండలం ధన్వాడ గ్రామంలో ఆదా గృహాలు మంజూరు కాగా 34 ఇల్ల నిర్మాణాలను మాత్రమే ప్రారంభించారు. 16 గృహాల కు భూమి పూజ చేయాల్సి ఉంది. మహాముత్తారం మండలంలో మాదారం గ్రామానికి 87 గృహాలు మంజూరు అయ్యాయి. ఇల్లు నిర్మాణం కోసం సుమారు 30 గృహాలకు ముగ్గు పోశారు. మహాదేవపూర్ మండలంలోని ఎలికేశ్వర గ్రామం లో 56 గృహాలు మంజూరు కాగా 16 గృహాల నిర్మాణం పనులు ప్రారంభించాల్సి ఉంది. మలహర్ మండలంలోని నాచారం పైలట్ గ్రామంలో 133 ఇళ్లు మంజూరు కాగా కేవలం 46 గృహాలుమాత్రమే పనులు ప్రారంభం చేశారు. లబ్ధిదారులు పేద కుటుంబాలకు చెందిన వారు కావడంతో డబ్బు లేక వెనుకడుగు వేస్తున్నారు. ఇలాంటి వారికోసం అధికారులు ప్రత్యామ్నాయ ఆలోచనలు చేయాలి. ఐదు లక్షల వ్యయంతో పూర్తయ్యేలా గుత్తేదారులతో మాట్లాడితే చాలామంది పేదలకు మేలు చేకూరుతుంది.

### ఇళ్ల నిర్మాణం లబ్ధిదారులకు సవాలే

మంథని నియోజకవర్గంలో 3500 ఇళ్లు మంజూరు చేసినట్లు మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు. కాటారం సబ్ డివిజన్లో పైలెట్ గ్రామాలు కాకుండా ఇతర గ్రామాలలో ఇళ్లు మంజూరు జులై మొదటి వారంలో జరుగుతుందని మంత్రి శ్రీధర్ పంపు ప్రకటించినప్పటికీ ఇప్పటికీ జాబితా విడుదల కాలేదు. ఆశావాహులు ఎప్పుడెప్పుడు గృహాలు మంజు రావు అవుతాయని ఎదురుచూస్తున్నారు. ఇళ్ల నిర్మాణాల పై క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటేనే నిర్మాణాలు ప్రారంభం అవుతాయి. గడువులోగా పూర్తవుతాయి. గడువు ముగిసిపోతే ప్రభుత్వం నుంచి నిధులు వచ్చే అవకాశం లేకుండా పోతుంది. ఇల్లు మంజూరు చేయించుకోవడంలో లబ్ధిదారులు చూపిస్తున్న శ్రద్ధ నిర్మాణం చేయడంలో లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. మంత్రి శ్రీధర్ శ్రీధర్ బాబు ప్రాతినిధ్యం వాయిస్తున్న కాటారం సబ్ డివిజన్లో మొదటి విడత గృహ నిర్మాణాల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతుండడం పట్ల అటు ప్రతిపక్షాలు ఆరోపణ చేస్తుండగా ప్రజల్లోనూ అసహనం వ్యక్తం అవుతోంది.

## నాదర్ గుల్ గ్రామం,కాసు బాగ్ కంచలో బోనాల సందడి

బోనాల ఉత్సవాలలో పాల్గొన్న అందెల శ్రీ రాములు యాదవ్



**బాలాపూర్ మహా:** ప్రాచీనమైన ఆదిపోచమ్మ ఆలయాన్ని డీజే సప్పుళ్లతో అమ్మ వారికి భోనాలు రైతులు సమర్పించారు. నాధర్ గుల్ గ్రామ పరధి లోని గ్రామస్థులు,రైతులు అందరు కలిసి గ్రామ శివారులో కాసు బాగ్ కాంచ లో వెలిసిన ప్రాచీన శ్రీ ఆది పోచమ్మ తల్లికి బోనాలు తీస్తున్న సందర్భంగా ముఖ్య అతిథిగా మహేశ్వరం బీజేపీ కంటెస్టెంట్ ఎమ్మెల్యే అందెలా శ్రీరాములు హాజరయ్యారు. ఈ మేరకు అందెలా శ్రీ రాములు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ శ్రీ ఆదిపోచమ్మ ఆశీస్సులతో మహేశ్వరం నియాయోజకవర్గ ప్రజలు ,నాదర్ గుల్ రైతులు సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నట్టు అయన తెలిపారు. అంగరంగ వైభవంగా ప్రతి సంవత్సరం బోనాల సందర్బంగా అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తున్నాము అని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషంగా ఉండాలని వేడుకున్నట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ అధ్యక్షులు చిర్ర రాజు, జెనరల్ సెక్రెటరీ తిరుపతి భాస్కర్,వైస్ ప్రెసిడెంట్ బోద్రమౌని లింగమయ్య,మర్రి ప్రభాకర్ రెడ్డి, బీజెపి నేత మంత్రి మహేష్,బి భాస్కర్,కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, మహా:** ఆషాడ బోనాల సందర్భంగా శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో ఆదివారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ దేవాలయాలలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శంషాబాద్ మున్సిపాలిటీ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సుష్మా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గనేష్ గుప్తా, మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులకు తదితరులు పాల్గొన్నారు.

### నేడు కాటారం సబ్ డివిజన్ లోమంత్రి
## శ్రీధర్ బాబు పర్యటన

**కాటారం, మహా :** రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు,శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమవారం మహదేవపూర్, కాటారం, మహా ముత్తారం మండలం లలో పర్యటిస్తున్నట్లు మంత్రి వ్యక్తిగత సహాయకులు చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. మహదేవపూర్ లో ఉదయం 930 కు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల లో హైదరాబాద్ గివ్ ఎన్జీఓ ద్వారా 650 మంది విద్యార్థులకు మంత్రి శ్రీధర్ బాబు స్కూల్ షూస్, స్పోర్ట్స్ షూస్ అందజేస్తారు. కాటారం లో ఉదయం 1100కు బి ఎల్ ఎం గార్డెన్స్ ఫంక్షన్ హాలులో కాటారం, మహా ముత్తారం, మల్హర్ రావు, మహాదేవపూర్, పలిమెల మండలాల్లోని స్వయం సహాయక మహిళా గ్రూపులకు వడ్డీ లేని రుణాల కింద 70 లక్షలు, భీమ కింద 74 లక్షల చెక్కులను లబ్ధిదారులకు మంత్రి శ్రీధర్ బాబు అందజేయనున్నారు. మహా ముత్తారంలోని ఉదయం 1230కు కోటి 20 లక్షలతో నూతనంగా నిర్వహించిన ఎంపీడీవో కార్యాలయం భవనాన్ని, నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనాన్ని ప్రారంభోత్సవం చేస్తారు. ఉదయం 100 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మహా ముత్తారంలో నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 200లకు బోర్ల గూడెం నూతన గ్రామ పంచాయతీ భవనానికి,అంగన్వాడి నూతన భవనానికి శంకుస్థాపన చేస్తారు.

## ఆమనగల్ కేంద్రంలో ఎస్టిఓ కార్యాలయం ఏర్పాటు చేయాలి

ఎంపీ మల్లు రవిని కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఎస్టిఓ సబ్ రిజిస్టర్ కార్యాలయం ఏర్పాటుకు కృషి ఎంపి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** నాగర్ కర్నూల్ ఎంపీ డా" మల్లురవి నివాసంలో మాడుగుల, తలకొండపల్లి, కడ్తాల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్టిఓ కార్యాలయం ఏర్పాటు కోసం వినతి పత్రం అందజేశారు. రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండల కేంద్రంలో ఉన్న ఎస్టిఓ, సబ్ రిజిస్టర్ కార్యాలయాలు, కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, మాడుగుల, కడ్తాలు మండలాల ప్రజలకు, 60 కిలోమీటర్ల దూరంలో ఉన్నందున, ఎస్టీఓ, సబ్ రిజిస్టార్ కార్యాలయాలకు వెళ్లి, రావడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కారణంగా, నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవిని కలిసిన, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, శ్రీనివాస్ రెడ్డి, కంబాలపల్లి వీరయ్య, విష్ణువర్ధన్, పట్నం శివరాజు ఎస్టిఓ, సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని ఆమనగల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది. సానుకూలంగా స్పందించిన ఆయన, రాష్ట్ర ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో, కలిసి మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందని నాయకులు తెలిపారు.



## వోల్వా కారులో మంటలు

తప్పిన పెను ప్రమాదం

**రాజేంద్రనగర్, మహా :** హైదరాబాద్ నుండి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయనికి వస్తున్న శ్రీకాంత్ చౌదరి వోల్వా టీఎస్ 07 ఎఫ్ ఎం 00 07, డీజిల్ కారులో నౌక సమీపంలో ఆదివారం షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగాయి. పోలీస్పె ట్రోలింగ్ వాహనాలు అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థానానికి చేరుకొని మంటలను అదుపు చేశాయి. అప్రమత్తమైన కారు డ్రైవర్ శ్రీకాంత్ చౌదరి కార్ లోంచి దిగి తన ప్రాణాలు కాపాడుకున్నాడు. కారులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న శంషాబాద్ ఎయిర్పోర్ట్ అవుట్ పోస్ట్ పోలీసులు.

## అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

అంగరంగ వైభవంగా ఆషాడ మాసం అమ్మవారి బోనాలు



**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మధురానగర్, కాపుగడ్డ, ఆర్బినగర్ ప్రాంతాలలో ఆషాధ మాసం బోనాల పండుగ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి దేవల కమిటీ సభ్యులు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మహేందర్, బిజెపి నాయకులు తో కలిసి అమ్మవార్లు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మాట్లాడుతూ అమ్మవారి చల్లని ఆశీస్సులు దీవెనలతో ప్రజలందరికీ ఉండాలన్నారు. సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో పాడిపంటలతో ఆనందంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవలయ కమిటీ సభ్యులు బిజెపి నాయకులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మాజీ సభ్యులు బిజెపి నాయకులు కోలన్ ప్రదీప్ రెడ్డి, బిజెపి నాయకులు రాహుల్, గురువారెడ్డి, దేవేందర్, బిజెపి నాయకులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షులుగా గోపాల్ ముదిరాజ్ నియామకం



**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్ర నగర్ నియోజికవర్గ బీసీ సంఘం అధ్యక్షులు గా గోపాల్ ముదిరాజ్ ను నియమించారు. బిసి సంక్షేమ సంఘం రాజేంద్ర నగర్ నియోజకవర్గ అధ్యక్షులు గా బండ్లగూడ జాగీర్ ఆదర్శ నగర్ కాలనీ నివాసి గోపాల్ ముదిరాజ్ ను ఆదివారం ఒక కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ బీసీ ల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని రాజకీయంగా ఎదగడానికి ప్రయత్నించాలని కోరారు. గోపాల్ ముదిరాజ్ మాట్లాడుతూ రాజేంద్ర నగర్ నియోజకవర్గంలో బీసీ లకోసం నిబద్ధతతో పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు విక్రమ్ . శ్యామ్ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



అంగరంగ వైభవంగా ఆషాఢ మాసం
## బోనాల జాతర

అమ్మవారికి బోనం సమర్పించిన మహిళలు

**రాజేంద్రనగర్ మహా;** రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని గగన్ పహాడ్ లో ఆదివారం ఆషాఢ మాస బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గగన్ పహాడ్ బస్తీలోంచి ఆషాఢ మాసం బోనాలు అమ్మవారి ఆలయానికి భారీ సంఖ్యలో డప్పుల చప్పుడుతో ఆడపడుచులుబోనాలను సమర్పించి అమ్మవారి ఆశీర్వచనాలు పొందారు.

## అత్యాశ వద్దు, అప్రమత్తంగా ఉండాలి

భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే



**భూపాలపల్లి, మహా :** అత్యాశ, అవగాహన లేకపోవడమే సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఐపీఎస్ అన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు స్వీయ అప్రమత్తత, అవగాహన కలిగిఉండటం అవసరమని ఆదివారం ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు డిజిటల్ అరెస్ట్ అనగానే భయపడవద్దని, నిర్భయంగా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే యువత బెట్టింగ్ యాప్ ల జోలికి వెళ్ళవద్దని ఎస్పీ హెచ్చరించారు. అంతేకాకుండా సోషల్ మీడియా ద్వారా వచ్చే లింకులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాటిని క్లిక్ చేసి మోసపోవద్దని జిల్లా ఎస్పీ గారు తెలిపారు. ఈ మధ్య కాలంలో కొంత మంది సైబర్ నేరగాళ్లు నకిలీ పీఎం కిసాన్, ఎస్బిఐ రివార్డ్ అనే ఏ పి కే ఫైల్స్ వాట్స్ అప్, టెలిగ్రాం మరియు సోషల్ మీడియా ద్వారా పంపిస్తున్నారని, పొరపాటున ఇలాంటి లింక్స్ క్లిక్ చేసి అప్లికేషన్ ఇన్స్టాల్ చేశారంటే మీ ఫోన్ హ్యాక్ అయి వినియోగదారుడి ఫోన్ లో గల ఓ టి పీలు, బ్యాంక్ వివరాలు మరియు వ్యక్తిగత వివరాలు చోరికి గురై సైబర్ నేరగాళ్ల అధీనంలోకి వెళతాయని, ఆపై బాధితుడి వాట్సప్ ఖాతాను హైజాక్ చేసి, అదే నకిలీ లింక్ ను అతని ఫోన్ లో ఉన్న కాంటాక్ట్స్ లకు ఆటోమేటిక్ గా పంపిస్తుందనీ, ఈ మోసాల ద్వారా బాధితులు ఆర్థిక నష్టాలు, డేటా చోరీకి గురవుతారని, ఇలాంటి నకిలీ APK ఫైల్స్ మోసాల బారిన పడకుండ ఉండాలంటే ప్రజలు వాట్సప్ లో అనుమానస్పద లింక్ లను క్లిక్ చేయరాదని అన్నారు. ఇలాంటి పీఎం కిసాన్ యోజన లేదా ఎస్బిఐ రివార్డ్స్ పేరుతో ఏ పి కే లింక్స్ వచ్చినప్పుడు వాటిని వెంటనే తొలగించాలని పేర్కొన్నారు. ప్రజలు తమ వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు లేదా ఓటిపిలు ఎవరితోనూ షేర్ చేయకుండా ఉండాలని తెలిపారు. ఈలాంటి సమాచారం ప్రభుత్వ సంస్థలు అడగవని, ఇలాంటి సంఘటనలు జరిగిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబరు కు కాల్ చేసి రిపోర్ట్ చేయాలని ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు.

## తెలంగాణలో బోనాలకు ప్రత్యేక విశిష్టత



**భూపాలపల్లి, మహా :** తెలంగాణ రాష్ట్రంలో ఆషాడం మాసంలో ప్రజలు చేసే బోనాల పండుగకు అత్యంత విశిష్టత ఉందని భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం శాయంపేట మండలం గట్లకానిపర్తి గ్రామంలో వైభవోపేతంగా సాగుతున్న మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో భూపాలపల్లి ఎమ్మెల్యేపాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ దేవతలను పూజించేందుకు బోనం ఎత్తే సంప్రదాయం రాష్ట్ర వ్యాప్తంగా ఉందని తెలిపారు. మహంకాళీ అమ్మవారి అనుగ్రహంతో వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. తెలంగాణలో బోనాలకు ఒక ప్రత్యేక స్థానం ఉందని,గట్లకానిపర్తి గ్రామస్తులంతా ఐక మత్యంగాఉండాలని, గ్రామానికి అవసరమైన అన్ని అభివృద్ధి పనులు చేసేందుకు తన వంతుగా సహకారం ఉంటుందన్నారు. భూపాలపల్లి లో చిట్యాల మండలం తిరుమలాపూర్ గ్రామానికి చెందిన 14 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రొసీడింగ్స్ అందజేశారు.



తెలుగు సినీ ఆర్ట్ డైరెక్టర్లకు
## వేములనర్వలో ఇంటి స్థలాల పంపిణీ

- ముఖ్య అతిథులుగా హాజరైన కేశంపేట మాజీ జెడ్పీటీసీ
- శ్రీమతి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, ప్రముఖ సినీ నటుడు ఆలీ

**షాద్ నగర్, మహా:** తెలుగు సినీ ఆర్ట్ డైరెక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేశంపేట మండలం, వేములనర్వ గ్రామ శివారులో సినీ ఆర్ట్ డైరెక్టర్లకు ఇంటి స్థలాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేశంపేట మాజీ జెడ్పీటీసీ శ్రీమతి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, ప్రముఖ సినీ నటుడు ఆలీ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విశాల శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ.. సినీ రంగంలో కళాకారుల కృషి, ప్రతిభ ఎనలేనివని కొనియాడారు. వారికి ఇంటి స్థలాలు లభించడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు ఆలీతో పాటు పలువురు సినీ డైరెక్టర్లు, నటులు పాల్గొన్నారు. ఈ స్థలాల పంపిణీతో ఆర్ట్ డైరెక్టర్ల దీర్ఘకాలిక స్వప్నం నెరవేరిందని, ఇది వారి కుటుంబాలకు భద్రతను చేకూరుస్తుందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు..



## తీన్మార్ మల్లన్నపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాము

తెలంగాణ మునురుకాపు వర్కింగ్ ప్రెసిడెంట్ బుక్క వేణుగోపాల్

**రాజేంద్రనగర్ మహా ;** బీసీ ముద్దుబిడ్డ తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడిని రాష్ట్ర మున్నూరు కాపు వర్కింగ్ ప్రెసిడెంట్ బుక్క వేణుగోపాల్ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి హింసాత్మక చర్యలు ప్రజాస్వామ్యంలో విలువలకు పూర్తిగా విరుద్ధమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా మాట్లాడే హక్కు ఉంది ఏదైనా తప్పుగా అర్థం చేసుకుంటే అందుకు వివరణ అడగాలి తప్ప భౌతిక దాడులకు పాల్పడటం చట్ట విరుద్ధమన్నారు. ఇలాంటి చర్యలకు తెగబడితే మునూరుకాపు రాష్ట్ర సంఘం చూస్తూ ఊరుకోదు అని బుక్క వేణుగోపాల్ హెచ్చరించారు. దాడి చేసిన వారు ఏవరైనా వారిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కట్టిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## నువ్వెంత.. నీ బ్రతుకెంత..!?

బీసీ రిజర్వేషన్ బ్రాండ్ అంబాసిడర్ సీఎం రేవంత్ రెడ్డి

కల్వకుంట్ల కవితపై మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల ఆగ్రహం..



**షాద్ నగర్, మహా:** కవితక్కా.. ఎందుకు అనవసరంగా ఆరాట పడతావు.. నీ ఖేల్ ఖతం.. సొంత పార్టీలోనే నీకు దిక్కులేదు.. బీఆర్ఎస్ దుఖ్నం బంద్.. ప్రజల్లోని ఆ పార్టీకి మద్దతు లేదు.. 42% బిసి రిజర్వేషన్లకు బ్రాండ్ అంబాసిడర్ మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. సీఎంను విమర్శించే స్థాయి నీకు లేదు.. ఇకనైనా ప్రగల్భాలు మానుకో.. అసలు నీ పార్టీలో నువ్వు ఏమిటో తెలుసుకో.. అంటూ కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పై విరుచుకుపడ్డారు. ఆదివారం కేశంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక నాలుగేళ్ల పాటు తెలంగాణ జాగృతి పేరుతో హడావిడి చేసిన కవిత ఆ తర్వాత ఎందుకు చల్లబడ్డారు.. తమ కార్యక్రమాలను ఎందుకు కొనసాగించలేకపోయారు.. ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ వచ్చాక మీ జాగృతి అక్రమాలు భరించలేక జనం జాగ్రత్తమయ్యారని ఫలితంగా బీఆర్ఎస్ ఫెయిల్ మార్కులతో ఇంటి పాట పట్టిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అయితే సున్నా మార్కులే వచ్చాయని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా సున్నా మార్కులే పునరావృతం అవుతాయని ఆమె జోస్యం చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఖేల్ ఖతం.. దుక్నం బంద్ అవుతుందన్నారు. కవితక్క కాంగ్రెస్ మీద పనికిమాలిన ఆరోపణలు చేయడం మానేసి తమ పార్టీలో ఉన్న దయ్యాల మీద దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాని, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గాని పూర్తి సమయాన్ని కేటాయించి సెలవు కూడా లేకుండా ప్రజల కోసమే పని చేస్తున్నారని పేర్కొన్నారు. కవితక్క ఎలాంటి టెన్షన్ తీసుకోవాల్సిన అవసరం లేదని తెలంగాణ ప్రజలు అభయహస్తం చేతిలో చాలా సంతోషంగా ఉన్నారని అన్నారు. నియోజకవర్గానికి వచ్చిన కవితక్కను తన పార్టీలోనే పలకరించే దిక్కు లేదని, ముందు ఇంట గెలిచి రచ్చ గెలవాలని హితవు చెప్పారు. మైక్ ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లు మాట్లాడే కవితక్క బీసీ రిజర్వేషన్లను కూడా తన ఖాతాలో వేసుకోవడం హాస్యాస్పదమన్నారు. బీసీ రిజర్వేషన్లకు బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఆమె స్పష్టం చేశారు. ఇది ప్రజల పాలన.. మీ గడీల పాలన కాదు.. రేవంత్ రెడ్డి అంటే ఫార్మ్ హౌస్ లో కూర్చుని కేసీఆర్ లా పనిచేసే వ్యక్తి కాదు.. నిత్యం ప్రజల్లో ఉండే వ్యక్తి.. ఇకనైనా ఇలాంటి ఉత్తర ప్రసంగాలు మానుకోవాలని కవితకు తాండ్ర విశాల సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు అనసూయ తదితర మహిళా కార్యకర్తలు నాయకురాలు పాల్గొన్నారు..

## అంగరంగ వైభవంగా అమ్మవారి బోనాలు

జిల్లాలో బోనమెత్తిన ఆడపడుచులు .. అమ్మవారి ఆశీర్వాదం కోసం తరలిన భక్తులు



రంగారెడ్డి జిల్లాలో అంగరంగ వైభవంగా ఆదివారం బోనాల జాతర కోలాహలంగా కొనసాగింది. మహంకాళి అమ్మవారి ఆశీర్వాదం కోసం తండోపతండాలుగా భక్త జనులు తరలివచ్చారు. మహేశ్వరం మండలంలోని మంఖాల గ్రామంలో కొలువుదీరిన శ్రీ శ్రీశ్రీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర కన్నుల పండుగగా కోలాహలంగా జరిగింది. గ్రామంలోని చిన్న పెద్ద అందరు కలిసి సంతోషంగా జరుపుకున్నారు. అమ్మవారికి బోనం సమర్పించి, మొక్కులు చెల్లించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీర్వాదాలు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రాజకీయ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మండల బ్లాక్ జిల్లా కాంగ్రెస్ కమిటీలు వాయిదా

**కాటారం, మహా :** పార్టీ సంస్థాగత ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఆదివారం గాంధీభవన్లో ఉమ్మడి కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో ఏఐసిసి ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన గ్రామ। మండల, బ్లాకు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీలను స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే వరకు నిలుపుదల చేస్తూ అందరి అభిప్రాయాల మేరకు నిర్మాణం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. స్థానిక సంస్థల ఎన్నికల తరువాత కాంగ్రెస్ సంస్థ గత ఎన్నికల నిర్మాణం చేపట్టాలని ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగినట్లు జయశంకర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు,రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గద్దె సమ్మిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపినారు.



# ఇంట్లో పవర్‌ట్రాక్.. వేలు పెట్టినా నో షాక్!

పొరపాటున సాకెట్‌లో వేలు పెడితే ఏమవుతుంది? దిమ్మతిరిగి.. మైండ్ బ్లాక్ అవుతుందా లేదా! అదేనండి.. షాక్ కొడుతుంది కదా! వంటగదిలోని పవర్ సాకెట్ అదీ.. రెండు, మూడు ప్లగుల్ని పెడితే చిటపట మెరుపులు.. షార్టుసర్క్యూట్లు. ఇలాంటి సమస్యలన్నింటికీ ఓ చక్కటి పరిష్కారం పవర్ ట్రాక్. ఎక్స్‌టెన్షన్ బాక్స్‌కు సరికొత్త రూపమే ఈ పవర్ ట్రాక్. దీని సాయంతో 5 నుంచి 13 విద్యుత్తు ఉపకరణాల్ని ఒకేచోట ఏర్పాటు చేయవచ్చు. ఏకకాలంలో ఇన్నింటిని వాడినా షార్టుసర్క్యూట్ అవుతుందనే భయమే అక్కర్లేదు. వంటింట్లో అయినా, ఆఫీసులో అయినా.. కరెంటు తీగల నుంచి కంప్యూటర్ వైర్ల వరకూ పవర్‌ట్రాక్‌లో బిగించొచ్చు. పవర్‌ట్రాక్ అంటే ఇదేదో కొత్త పరికరం అనుకునేరు. రెండు, మూడు ప్లగ్గులు పెట్టాల్సి వస్తే ఎక్స్‌టెన్షన్ బాక్సులు, పవర్‌స్ట్రిప్‌ల వాడకం తెలిసిందే కదా! సరిగ్గా ఇది కూడా అలాంటిదే అన్నమాట. అయితే వాటితో పోలిస్తే రెండు, మూడు రెట్లు ఎక్కువ సంఖ్యలో విద్యుత్తు ఉపకరణాలు ఏర్పాటు చేసుకునే వీలు ఇక్కడుంటుంది. ఇదే ఈ పరికరం ప్రత్యేకత. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బహుముఖ అవసరాల్ని తీర్చే పవర్‌ట్రాక్ రెండు రకాలు. గృహావసరాలకు ఉపయోగపడే కాంపాక్ట్ ట్రాక్, ఆఫీసుల్లో ఉపయోగించే డాటా ట్రాక్, పవర్‌ట్రాక్‌ను గోడకు బిగించడం వల్ల చూడటానికి చక్కటి లుక్కు వస్తుంది. వైర్ల గజిబిజి ఉండదు. పైగా పూర్తి సురక్షితం. అందుకే వీటికి గిరాకీ అధికం. వంటగది, స్టడీరూమ్, లివింగ్‌రూమ్‌లతో పాటు ఆఫీసుల్లోనూ వీటిని విరివిగా వాడొచ్చు. సైజును బట్టి ఒక పవర్‌ట్రాక్ ద్వారా ఐదు నుంచి పదమూడు విద్యుత్తు ఉపకరణాల్ని ఏకకాలంలో వాడుకోవచ్చు. 500 మిల్లీమీటర్లు, 600 మిల్లీమీటర్లు, 1,300 మిల్లీమీటర్ల పొడవుతో దొరుకుతాయి. పైన అల్యూమినియం, లోపల థర్మోప్లాస్టిక్ రబ్బర్ మెటీరియల ఉపయోగించే పవర్‌ట్రాక్‌ల ధర రూ.5 వేల నుంచి రూ.7వేల వరకు ఉంది.

**ఎన్నెన్నో లాభాలు..**

సాకెట్లు.. ఎక్స్‌టెన్షన్ బాక్సుల్లో ఒక్కోసారి ప్లగ్గులు సరిగా దూరవు. ఫలితంగా ప్లగ్ పిన్నును పెట్టగానే సాకెట్ నుంచి చిటచిట మెరుపులు వస్తుంటాయి. ప్లగ్‌ని పైకి ఎత్తిపట్టుకుంటే కానీ మిక్సర్ తిరక్కపోవచ్చు. ఇలాంటి సమస్యలు పవర్‌ట్రాక్‌లో కన్పించవు. ఒక్కోసారి చిన్నపిల్లలు తెలీక ప్లగ్గుల్లో చెంచాలు, ఇనుపముక్కలు, వేళ్లు పెట్టి షాక్‌కు గురవుతుంటారు. పవర్‌ట్రాక్‌తో అలాంటి భయమే అక్కర్లేదు. లోపల వేళ్లు పెట్టినా ఇబ్బందే ఉండదు. 100 శాతం షాక్‌ప్రూఫ్ ఇది. స్విచ్‌బోర్డు అయితే సాకెట్ అమర్చిన చోటే ప్లగ్ పెట్టాల్సి ఉంటుంది. ఒకవైపు అందకపోవడం, ఉపకరణాల్ని అటూఇటూ జరపడం వంటి ఇబ్బందులుంటాయి. ఇందులో అలాకాదు. ట్రాక్‌లో ఈ చివర నుంచి ఆ చివర వరకు ఎక్కడైనా పెట్టుకోవచ్చు. రకం ఏదైనా పవర్‌ట్రాక్‌తో మూడు సాకెట్లు ఉచితంగా వస్తాయి. అదనంగా కావాలంటే, వాటిని ప్రత్యేకంగా కొనుక్కోవాల్సి ఉంటుంది. డాటాట్రాక్‌ను గృహావసరాలకు కూడా వాడుకోవచ్చు. కాంపాక్ట్‌ట్రాక్‌ను మాత్రం ఆఫీసుల్లో వాడలేం.

# ఈ క్రెడిట్ కార్డు.. ప్రపంచంలోనే అత్యంత ఖరీదు

ఈరోజుల్లో దాదాపు ప్రతిఒక్కరి దగ్గర ముఖ్యంగా ముఖ్యంగా వర్కింగ్ ప్రొఫెషనల్స్ అందరి దగ్గరా క్రెడిట్ కార్డులు ఉన్నాయి. కొందరి దగ్గరైతే రెండు, మూడుకు మించి కూడా క్రెడిట్ కార్డులు ఉంటున్నాయి. క్రెడిట్ సదుపాయంతోపాటు ఆకర్షణీయమైన ప్రయోజనాల కోసం చాలా మంది క్రెడిట్ కార్డులను వినియోగిస్తుంటారు. అయితే ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన క్రెడిట్ కార్డు గురించి తెలుసా? దీని కోసం ఎంత ఖర్చవుతుందో తెలిస్తే నోరెళ్లబెడతారు.. నేటి ప్రపంచంలో క్రెడిట్ కార్డులు రోజువారీ జీవితంలో భాగంగా మారాయి. చాలా మంది ఒకటి కంటే ఎక్కువ క్రెడిట్ కార్డులను కలిగి ఉంటారు. అసరమైనప్పుడు ఖర్చు చేసేందుకు మాత్రమే కాకుండా సినిమా టిక్కెట్లపై డిస్కౌంట్లు, రివార్డ్ పాయింట్లుక,ఉచిత ఎయిర్ పోర్ట్ లాంజ్ యాక్సెస్ వంటి ప్రయోజనాలను కూడా క్రెడిట్ కార్డులు. ఈ ప్రయోజనాలు పరోక్షంగా డబ్బు ఆదా చేయడానికి సహాయపడతాయి. అయితే క్రెడిట్ కార్డులను జాగ్రత్తగా ఉపయోగించకపోతే మాత్రం ఆర్థిక ఒత్తిడికి దారితీస్తుంది.



**భారత్‌లో 200 మంది దగ్గరే..**

ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన క్రెడిట్ కార్డు ఒకటి ఉంది. దీని పేరు అమెరికన్ ఎక్స్ ప్రెస్ సెంచూరియన్ కార్డ్. సింపుల్‌గా అమెక్స్ బ్లాక్ కార్డ్ అని పిలుస్తారు. దీనిని అమెరికన్ ఎక్స్ ప్రెస్ బ్యాంక్ జారీ చేస్తుంది.ఈ కార్డు ఖరీదైనది మాత్రమే కాదు. చాలా ప్రత్యేకమైనది కూడా. ఇది అందరికీ అందుబాటులో ఉండదు. సాధారణ కార్డుల మాదిరిగా దీనికి దరఖాస్తు చేయలేము. నివేదికల ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా కేవలం లక్ష మందికి మాత్రమే ఈ కార్డు ఉంది. భారత్ లో అయితే కేవలం 200 మంది దగ్గర మాత్రమే ఈ కార్డు ఉందని చెబుతున్నారు. ఇది 2013లో భారత మార్కెట్లోకి ప్రవేశించింది.

**రూ.10 కోట్లు ఖర్చు చేసే సామర్థ్యం ఉండాలి**

అమెక్స్ బ్లాక్ కార్డు ఆహ్వానం ద్వారా మాత్రమే ఇస్తారు. అది కూడా చాలా అధిక ఆదాయం, ఖర్చు అలవాట్లు ఉన్నవారికి. అర్హత సాధించాలంటే రూ.10 కోట్ల వరకు ఖర్చు చేసే సామర్థ్యం ఉండాలి. దీన్నిబట్టి ఈ కార్డు కేవలం ధనవంతుల కోసమేనని స్పష్టమవుతోంది. అమెరికన్ ఎక్స్ ప్రెస్ సెంచూరియన్ కార్డ్‌తో ప్రపంచ స్థాయి హోటళ్లలో బస, ప్రైవేట్ జెట్ సేవలు, ఎయిర్‌పోర్టులలో వీఐపీ ట్రీట్‌మెంట్ వంటి అల్ట్రా లగ్జరీ సదుపాయాలు లభిస్తాయి.

**రూ.లక్షల్లో కార్డు ఫీజు**

అమెక్స్ బ్లాక్ కార్డు ఖరీదు మామూలుగా ఉండదు. భారత్‌లో ఈ కార్డ్ ఇనీషియేషన్ ఫీజు రూ.7 లక్షలు, జాయినింగ్ ఫీజు రూ.2.75 లక్షలు ఉంటుంది. వీటికి జీఎస్టీ అదనం. అంటే ఈ క్రెడిట్ కార్డుకు మొదటి ఏడాది చెల్లించాల్సి మొత్తం రూ.11.5 లక్షలు దాటుతుంది. ఇక వార్షిక రుసుము రూ.2.75 లక్షలు జీఎస్టీతో కలుపుకొంటే రూ.3,24,500 అవుతుంది.

# ఇంటికే అందం.. ఇలాంటి ఫ్లోరింగ్..

శుభ్రం చేయడమెంతో తేలిక. దీర్ఘకాలపు మన్నిక.. ఎలాంటి మరకలైనా తుడవగానే మాయం. నిర్వహణలో కన్పించని సమస్యలు. పైగా ఇంటికే సరికొత్త అందం. ఇలాంటి అనేకానేక ప్రత్యేకతల కారణంగా వెదురు గచ్చు(బ్యాంబూ ఫ్లోరింగ్)కి రోజురోజుకీ ఆదరణ పెరుగుతోంది. భూతాపాన్ని తగ్గించడానికి ప్రపంచం దృష్టి సారిస్తున్న నేపథ్యంలో.. పర్యావరణ ప్రియుల దృష్టి వెదురు గచ్చు మీద పడింది. ఇతర రకాల కలప కంటే దృఢంగా ఉండటం.. చూడ్డానికి చక్కగా కన్పించడం.. తదితర కారణాలతో వెదురు గచ్చుకి గిరాకీ పెరుగుతోంది.

**రెండు రకాలు..**

వెదురు గచ్చులో ఎలిగెంట్, ఎలైట్ అనే రెండు రకాలు లభిస్తాయి. వీటి తయారీ ప్రక్రియల్లో చాలా తేడా ఉంటుంది. కత్తిరించిన చిన్నచిన్న బ్యాంబూని అతికించేది ఎలిగెంట్ అయితే.. దీనికి భిన్నంగా బ్యాంబూ ఫైబర్‌తో చేసేది ఎలైట్ రకం. ఇదెంతో దృఢంగా ఉంటుంది. మొత్తం మూడు వర్ణాల్లో ఈ కలప లభిస్తుంది. ఆరేళ్ల పాటు చెక్కు చెదరకుండా ఉండటం కోసం గచ్చుకి ఆరు లేయర్ల పాలియురేథెన్ కోటింగ్ వేస్తారు.



**ధర ఎంత?**

ప్రస్తుతం ఈ తరహా కలపను చైనా నుంచి దిగుమతి చేస్తున్నారు. దీనితో ఇంటిని అలంకరించాలంటే.. చదరపు అడుగుకి రూ.200-350 దాకా ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. అంటే ఓ వంద చదరపు అడుగుల గదికి సుమారు రూ.20 వేలు అవుతుందన్నమాట. మార్కెట్లో లభించే ఇతర కలపతో తయారైన ఫ్లోరింగ్ కోసం చదరపు అడుగుకి రూ.300దాకా అవుతుంది. వెదురు కలపను ఇంట్లో వేయడానికి విడిగా చార్జీలుంటాయి. చదరపు అడుగుకి రూ.15 దాకా తీసుకుంటారు. ఆసక్తికర విషయం ఏమిటంటే.. మీ ఇంట్లో ప్రస్తుతం ఎలాంటి గచ్చు ఉన్నా.. దానిపై బ్యాంబూ ఫ్లోరింగ్‌ను సులువుగా వేసుకోవచ్చు. పైగా ఒక్కరోజులో పని పూర్తవుతుంది. వెదురు గచ్చు ప్రత్యేకతలు అన్నీ ఇన్నీ కావు. దీనిపై గీతలు కన్పించవు. కాలిపోవడమంటూ ఉండదు. కొన్నాళ్ల తర్వాత రంగు వెలిసిపోతుందన్న దిగులక్కర్లేదు. నిర్వహణలో శ్రమపడక్కర్లేదు.

**బుడతల గదికి ప్రత్యేకం..**

సిరాను పీల్చుకునే గుణం వెదురు గచ్చుకి ఉండటం వల్ల.. చాలామంది తమ బుడతల గదుల్లో వాడుతున్నారు. చిన్నారులు కిందపడినా దెబ్బలు తగలవు. హోమ్ థియేటర్లు, పడక గదుల్లోనూ ఈ తరహా గచ్చును కోరుకునేవారి సంఖ్య పెరుగుతోంది. సంపన్న గృహాల్లోని బయటి ప్రాంతాల్లోనూ ఈ రకం కలపతో అలంకరిస్తున్నారు. ఉద్యానవనాలు, బాల్కనీలు, స్విమ్మింగ్‌పూల్, పోర్టికోల వద్ద విరివిగా ఉపయోగిస్తున్నారు. ఇందుకోసం చదరపు అడుగుకి రూ.400 వరకూ అవుతుంది. అన్నిరకాల వాతావరణానికి ఎదురొడ్డి నిలబడం వల్ల వెదురు గచ్చు మీద ప్రత్యేక మక్కువ పెరుగుతోంది.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# మివి నుంచి ఏఐ బడ్స్.. భాష ఏదైనా హాయ్ మివి అంటే చాలు..

కన్జూమర్ ఎల్రక్టానిక్స్ సంస్థ మివి కొత్తగా కృత్రిమ మేథ ఆధారిత ఏఐ బడ్స్‌ను ప్రవేశపెట్టింది. సెటింగ్స్ ఏవీ మార్చకుండానే తెలుగు, హిందీ సహా ఎనిమిది భారతీయ భాషలను ఇది అర్థం చేసుకుని, ప్రతిస్పందిస్తుంది. యూజర్ల ప్రాధాన్యతలను గుర్తుపెట్టుకుని, సందర్భానుసారంగా వ్యవహరించేలా దీన్ని రూపొందించినట్లు సంస్థ కో–ఫౌండర్ మిధులా దేవభక్తుని తెలిపారు. 40 గంటల బ్యాటరీ లైఫ్, 3డీ సౌండ్‌స్టేజ్, స్పష్టత కోసం క్వాడ్ మైక్ మొదలైన ప్రత్యేకతలు ఉన్నాయి. దీని ధర రూ. 6,999గా ఉంటుంది. ఏఐ బడ్స్ లో మివి ఏఐ అనే ప్రొప్రైటరీ వాయిస్ అసిస్టెంట్ ఉంది. "హాయ్ మివి" అంటే చాలు ఈ వాయిస్ అసిస్టెంట్ ప్రతిస్పందిస్తుంది. ఇది ఎనిమిది భారతీయ భాషలకు సపోర్ట్ చేస్తుంది. అవి హిందీ, తమిళం, తెలుగు, బెంగాలీ, మరాఠీ, కన్నడ, మలయాళం, గుజరాతీ. లాంగ్వేజ్ సెట్టింగ్ ల మార్చుకునే పనిలేకుండానే వినియోగదారులు ఏ భాషలోనైనా ప్రశ్నలు అడగవచ్చు లేదా సహాయాన్ని అభ్యర్థించవచ్చు. అసిస్టెంట్ అవతార్ ల ద్వారా మివి ఏఐ బడ్స్ వివిధ పనులకు సహకారం అందిస్తుంది. ఇవి ప్రీ డిఫైన్డ్ మాడ్యూల్స్.

- జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలకు గురు అవతార్ సమాధానాలు చెబుతుంది.
- ఇంటర్వ్యూవర్ అవతార్ మాక్ ఇంటర్వ్యూలు, ఫీడ్ బ్యాక్ అందిస్తుంది.
- చెఫ్ అవతార్ వంట చేయడంలో మార్గనిర్దేశం చేస్తుంది.
- వెల్ నెస్ కోచ్ అవతార్ సంభాషణల సమయంలో యూజర్ ఇన్ పుట్ లకు స్పందిస్తుంది.
- న్యూస్ రిపోర్టర్ అవతార్ యూజర్ ఆసక్తుల ఆధారంగా న్యూస్ అప్ డేట్స్ అందిస్తుంది.
- గూగుల్ ప్లే స్టోర్లో అందుబాటులో ఉన్న మివి ఏఐ యాప్ ద్వారా యూజర్లు ఏఐ సెట్టింగ్స్, ఫీచర్లను మేనేజ్ చేసుకోవచ్చు.



# పాక్ ఆర్మీ చీఫ్ మునీర్‌కు ఝలక్..

## ప్రధాని కీలక ప్రకటన



**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీని గద్దె దింపేసి ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ ఆ పదవిని చేపట్టాలని భావిస్తున్నారంటూ వస్తున్న వార్తలను ప్రధానమంత్రి షహబాజ్ షరీఫ్ తీవ్రంగా ఖండించారు. అవన్నీ కేవలం వదంతులేనంటూ కొట్టిపారేశారు. జర్దారీ ఐదేళ్ల పూర్తి కాలం కొనసాగుతారన్నారు. 'ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ దేశాధ్యక్ష పదవిపై ఎన్నడూ ఆసక్తి వ్యక్తం చేయలేదు. ప్రస్తుతానికి అటువంటి ప్రణాళిక కూడా ఏదీ లేదు'అని ఆయన స్పష్టం చేశారు. మునీర్, జర్దారీ మధ్య సానుకూల సంబంధాలున్నాయి. ఇద్దరికీ ఒకరంటే ఒకరికి గౌరవముంది. పాకిస్తాన్ అభివృద్ధి, పురోగమనమే వీరిద్దరి లక్ష్యం కూడా'అని ప్రధాని వివరించారు. 'జర్దారీ, మునీర్, షరీఫ్‌లే లక్ష్యంగా తప్పుడు జరుగుతోంది. దీని వెనుక విదేశీ శక్తులున్న సంగతి మాకు తెలుసు. జర్దారీ స్థానంలో ఆర్మీ చీఫ్ మునీర్ రానున్నారంటూ వస్తున్న వార్తలు పూర్తి అసత్యాలు. దీనిపై ఎలాంటి చర్చలు జరగలేదు. అటువంటి యోచన కూడా లేదు' అంటూ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి మొహ్సిన్ నక్వీ ఎక్స్‌లో చేసిన ప్రకటన అనంతరం ప్రధాని ఈ మేరకు వివరణ ఇవ్వడం విశేషం. ప్రధాని పదవిని షహబాజ్‌కు, అధ్యక్ష బాధ్యతలను జర్దారీకి అప్పగించేందుకు అధికార కూటమిలో గతేడాది ఒప్పందం కుదిరింది. ఆ మేరకు జర్దారీ ఐదేళ్ల కాలానికి దేశాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

**అణు కార్యక్రమంపై ప్రకటన..**

ఇదే సమయంలో.. భారత్‌తో ఇటీవల నెలకొన్న ఉద్రిక్తతలు అణు ఘర్షణలకు దారితీయొచ్చనే ఆందోళనలను పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తోసిపుచ్చారు. ఇస్లామాబాద్‌లోని విద్యార్థులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ.. అణు కార్యక్రమం కేవలం శాంతియుత ప్రయోజనాల కోసమేనని పేర్కొన్నారు. దేశ రక్షణ కోసమే వాటిని వినియోగిస్తామని వెల్లడించారు. భారత్ పాక్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల సమయంలో 55 మంది తమ దేశ పౌరులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఇదిలా ఉండగా.. పహల్గాంలో పర్యాటకులపై పాశవిక ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. దీంతో భారత్ పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ దాడికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టి పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేసింది. ఆ తర్వాత ఇస్లామాబాద్ ఎదురుదాడికి దిగగా.. భారత్ వాటిని సమర్థంగా అడ్డుకుంది. ఆ తర్వాత ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది.



# కాలిఫోర్నియాలో వలసదారుల అరెస్టులు ఆపండి

## ట్రంప్ యంత్రాంగానికి ఫెడరల్ జడ్జి ఆదేశాలు

**లాస్ ఏంజెలెస్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వలసదారులను ఎక్కడపడితే అక్కడ ఆపి తనిఖీలు చేపట్టడం, అరెస్ట్‌లు చేయడం తక్షణమే ఆపేయాలని ఫెడరల్ జడ్జి ఒకరు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం దక్షిణ కాలిఫోర్నియా ప్రాంతంలోని హిస్పానిక్‌లు, లాటినోలను పథకం ప్రకారం వేధిస్తోందని గత వారం లాస్ ఏంజెలెస్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టులో వలసదారుల తరఫున పలు పిటిషన్లు దాఖలయ్యాయి. గుర్తింపు కార్డులు చూపినా ఇద్దరు అమెరికా పౌరులను మరో ముగ్గురు వలసదారులను ఎటువంటి వారెంట్లు లేకుండా అధికారులు నిర్బంధంలోకి తీసుకున్నారని ఆరోపించారు. కేవలం శరీరం రంగు ఆధారంగా అరెస్ట్‌లు చేయడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. విచారణ చేపట్టిన జడ్జి మామె ఈ ఫ్రిమ్‌పాంగ్ శుక్రవారం పలు ఆదేశాలను వెలువరించారు. లాస్ ఏంజెలెస్ సహా కాలిఫోర్నియాలోని ఏడు కౌంటీల పరిధిలో వలసదారుల అరెస్ట్‌లు, సోదాలను నిలిపివేయాలన్నారు. అంతేకాదు, వలసదారులను నిర్బంధించిన లాస్ ఏంజెలెస్ డిటెన్షన్ కేంద్రంలోకి అటార్నీ ప్రవేశించకుండా ఫెడరల్ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సైతం రద్దు చేశారు.

# ఈయూ, మెక్సికోపై 30% టారిఫ్‌లు

## ఆగస్టు 1 నుంచే అమల్లోకి.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన




**వాషింగ్టన్:** యూరోపియన్ యూనియన్ (ఈయూ), మెక్సికో దేశాల ఉత్పత్తులపై 30 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఆగస్టు 1వ తేదీ నుంచే ఈ సుంకాలు అమల్లోకి వస్తాయని వెల్లడించారు. సుంకాలపై ఆయా దేశాలకు రాసిన లేఖలను సోషల్ మీడియాలో శనివారం పోస్టుచేశారు. అక్రమ వలసదారులు, మత్తు పదార్థాలు అమెరికాలోకి ప్రవేశించకుండా నిరోధించడానికి మెక్సికో ప్రభుత్వం తమకు చక్కగా సహకరిస్తోందని మెక్సికోకు రాసిన లేఖలో ట్రంప్ ప్రశంసించారు. మత్తు పదార్థాల నియంత్రణకు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని మెక్సికో ప్రభుత్వానికి సూచించారు. అలాగే ఈయూతో అమెరికాకు వాణిజ్య లోటు ఉందని, ఇది తమ జాతీయ భద్రతకు ముప్పేనని తేల్చిచెప్పారు. ఈ లోటును పూడ్చడానికి కలిసికట్టుగా పనిచేద్దామని ఈయూకు రాసిన లేఖలో పిలుపునిచ్చారు. అమెరికా ఉత్పత్తులపై ఈయూ దేశాలు అధికంగా టారిఫ్‌లు విధిస్తున్నాయని ట్రంప్ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఆయన ఇప్పటిదాకా 24 దేశాలతో పాటు 27 దేశాలతో కూడిన ఈయూపై టారిఫ్‌లను ప్రకటించారు. మరికొన్ని దేశాలపై సుంకాలను త్వరలో ప్రకటించే అవకాశం ఉంది. ఏ రెండు దేశాల మధ్యనైనా సరే టారిఫ్‌లు ఒకేరకంగా ఉండాలని ట్రంప్ వాదిస్తున్నారు. ఒక దేశం నుంచి వచ్చే ఉత్పత్తులపై అధికంగా సుంకాలు వసూలు చేస్తూ.. అదే దేశానికి ఎగుమతయ్యే మన ఉత్పత్తులపై సుంకాలు తక్కువగా ఉండాలని కోరుకోవడం న్యాయం కాదని అంటున్నారు.

# అన్నీ అల్లు అర్జునే.. కెరీర్‌లో తొలిసారి



'పుష్ప 2' సినిమా రిలీజై దాదాపు ఆరేడు నెలలు అయిపోయింది. దీని తర్వాత అల్లు అర్జున్ ఏ సినిమా చేస్తాడా అన్న సస్పెన్స్‌కి కొన్నాళ్ల ముందు తెరదించాడు. తమిళ దర్శకుడు అట్లీతో కలిసి భారీ బడ్జెట్ మూవీ చేయబోతున్నారని ఇదివరకే క్లారిటీ ఇచ్చారు. హీరోయిన్‌గా దీపికా పదుకొణె నటిస్తుందని కూడా ప్రకటించారు. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్‌తో పాటు షూటింగ్ మొదలైందని తెలుస్తోంది. ఇప్పుడు క్రేజీ అప్‌డేట్ ఒకటి వినబడుతోంది. అల్లు అర్జున్ ఇప్పటివరకు 21 సినిమాలు చేశాడు. కానీ ఎందులోనూ ద్విపాత్రాభినయం చేయలేదు. కానీ అట్లీ సినిమా కోసం మాత్రం ఏకంగా నాలుగు పాత్రలు పోషించనున్నాడట. అవి కూడా తాత, తండ్రి, ఇద్దరు కొడుకులుగా బన్నీనే కనిపించబోతున్నాడని సోషల్ మీడియాలో తెగ మాట్లాడుకుంటున్నారు. ప్రస్తుతానికి ఇది రూమర్ కావొచ్చు. ఒకవేళ ఇదే నిజమైతే మాత్రం బన్నీ ఎలా కనిపిస్తాడా అని ఎగ్జైట్‌మెంట్ గ్యారంటీ. అట్లీబన్నీ సినిమాలో దీపికతోపాటు మృణాల్ ఠాకుర్, జాన్వీ కపూర్, రష్మిక కూడా ఉన్నారని టాక్ వినిపిస్తుంది. అలానే హాలీవుడ్ నటుడు విలన్‌గా కనిపించే అవకాశముందని కొన్ని రోజుల క్రితం గట్టిగా వినిపించింది. ఇలా ఎప్పటికప్పుడు ఏదో గాసిప్ వినిపిస్తూనే ఉంది. అలా ట్రెండ్ అవుతూనే ఉంది. మరి వీటిలో ఎన్ని నిజం ఎన్ని అబద్ధం అనేది కొన్నిరోజులు ఆగితే గానీ క్లారిటీ రాదు.

అప్పటివరకు బన్నీ ఫ్యాన్స్ వెయిట్ చేయక తప్పదు.



## విజయ్ దేవరకొండ సినిమాలో ఛాన్స్.. ప్రభాస్ వారం రోజులకే..

**తన ప్రత్యేకమైన స్టయిల్, స్వతంత్ర భావనతో ప్రతి సినిమాలోనూ కొత్తగా కనిపించే మాళవిక మోహనన్ త్వరలోనే టాలీవుడ్‌లో స్టార్‌గా వెలుగొందనుంది. ఆ విషయాలే మీకోసం..**

**రాజాసాబ్ బ్యూటీ..**

మాళవిక మోహనన్ కొన్ని తమిళ, మలయాళ డబ్బింగ్ సినిమాల ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యింది. తాజాగా ప్రభాస్ 'రాజా సాబ్' సినిమాలో నాయికగా నటించడంతో ఆమెకి తెలుగులో మంచి క్రేజ్ వచ్చేసింది. మాళవిక తండ్రి కె.యు. మోహనన్ కూడా సినీరంగానికే చెందినవాడు. షారుఖ్ ఖాన్ 'డాన్', 'తలాష్', 'ఫక్రే' వంటి ఎన్నో సినిమాలకు కెమెరా బాధ్యతలు నిర్వహించారు.

**తండ్రితో లొకేషన్‌కి..**

మాళవిక.. కేరళలోని పయ్యనూర్ అనే గ్రామంలో జన్మించింది. అయితే చిన్నప్పటి నుంచి ముంబైలోనే పెరిగింది, చదువుకుంది కూడా అక్కడే. కేవలం చదువు పూర్తి చేయాలనే ఉద్దేశంతో మాస్ మీడియాలో డిగ్రీ పూర్తి చేసింది కాని, అసలు ఆసక్తి సినిమాలవైపే! ఒకసారి తండ్రి మోహనన్ యాడ్ ఫిల్మ్ షూటింగ్ చేస్తుండగా, ఆమె లొకేషన్‌కు వెళ్లింది. ఆ యాడ్‌లో మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి నటించారు.

**ఫ్యాషన్ డిజైనింగ్‌పై ఆసక్తి**

ఆమె నటనపై చూపిన ఆసక్తిని గమనించిన మమ్ముట్టి, తన కుమారుడు దుల్కర్ సల్మాన్ సినిమాలో అవకాశం ఇప్పించారు. అలా మాళవిక కెరీర్ మొదలైంది. 'పట్టమ్ పోలే' అనే మలయాళ చిత్రం ఆమె మొదటి సినిమా. ఆ సినిమా సమయంలో కాస్ట్యూమ్స్ డిజైనర్ అనారోగ్యం కారణంగా పని చేయలేకపోయారు. దాంతో మాళవిక తన దుస్తులను తానే డిజైన్ చేసుకుంది. అక్కడి నుంచి ఫ్యాషన్ డిజైనింగ్ మీద ఆసక్తి పెరిగి, 'ది స్కార్లెట్ విండో' అనే పేరుతో తన బ్రాండ్ ప్రారంభించింది.

**ధైర్యం ఎక్కువే!**

మాళవిక చాలా ధైర్యంగా ఉండే అమ్మాయి. సోషల్ మీడియాలో గ్లామర్ ఫోటోలు పెడుతుంటే, కొందరు నెటిజన్లు తప్పుడు కామెంట్లు పెట్టారు. మర్యాదగా, పద్ధతిగా ఉండాలని సూచనలు ఇచ్చారు. దానికి స్పందనగా పద్ధతిగా చీర వేసుకున్న ఓ ఫొటో పోస్ట్ చేసింది. ఆ ఫొటోలో కూడా షార్ట్, చిన్న చొక్కా ఉండడంతో మరింత సెన్సేషన్ అయింది. 'ఒక ఆడపిల్ల ఏ బట్టలు వేసుకోవాలో, ఎలా ఉండాలో చెప్పే హక్కు ఎవరికీ లేదు. ఎవరి పని వారు చూసుకుంటే బెటర్' అని కౌంటరిచ్చింది.

**విజయ్ దేవరకొండతో మూవీ**

భవిష్యత్తులో డైరెక్టర్ లేదా సినిమాటోగ్రాఫర్‌గా మారాలనేది ఆమె ఆశ. రింగులు అంటే మాళవికకి చాలా ఇష్టం. వందల సంఖ్యలో రింగులు కలెక్ట్ చేసింది. చాలామందికి తెలియని విషయం ఏమిటంటే – తెలుగులో ఆమెకి వచ్చిన మొదటి అవకాశం 'రాజా సాబ్' సినిమా కాదు. మొదట విజయ్ దేవరకొండ సినిమా కోసం ఎంపికైంది. కొన్ని రోజులు షూటింగ్ జరిగాక ఆ సినిమా నిలిచిపోయింది. ఆ సినిమా పేరు 'హీరో'.

**తెలుగు ప్రేక్షకులు ప్రత్యేకం**

సూపర్ స్టార్ రజనీకాంత్ అంటే మాళవికకి విపరీతమైన అభిమానం. ఆయనతో 'పేట' సినిమాలో నటించే అవకాశం రావడంతో ఎంతో థ్రిల్ అయ్యిందట! అలాగే విజయ్‌తో 'మాస్టర్' సినిమాలో కూడా నటించింది. తెలుగు ప్రేక్షకులు ఎంతో ప్రత్యేకమని మాళవిక చెప్పింది. 'ఒక్క సినిమాలో కనిపించినా చాలు – తెలుగు వారు ఎంతగానో ప్రేమిస్తారు. అలా అభిమానించే ప్రేక్షకులు మరే భాషలో ఉండరని నాకు అనిపిస్తుంది' అని చెప్పింది.



## నువ్వే కావాలి అంటున్న తమన్నా ఫ్యాన్స్

ఐటెం సాంగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిన బ్యూటీ తమన్నా అని చెప్పవచ్చు. చాలామంది అగ్ర కథానాయికలు ఐటమ్ సాంగ్స్‌లో నటిస్తున్నా, తమన్నా నటిస్తున్న ఐటమ్ సాంగ్స్‌లో ఉండే మజానే వేరు. అది తెలుగు, తమిళం, హిందీ ఏ భాషలో అయినా కావచ్చు ఆమె చేసే డాన్స్‌లో ఉండే కిక్కే వేరు. ఇటీవల హిందీ చిత్రం 'స్త్రీ2'లో తమన్నా నటించిన ప్రత్యేక పాట ఆ చిత్రానికే హైలెట్ అయింది. కాగా ఆ మధ్య తమిళంలో రజనీకాంత్ కథానాయకుడుగా నటించిన జైలర్ చిత్రంలో 'వా నువ్వు కావాలయ్యా' అనే ప్రత్యేక పాటలో తమన్నా డాన్స్ తీసుకొచ్చిన క్రేజ్ అంతా ఇంతా కాదు. ఏకంగా ఈ సాంగ్ ఆడియో, వీడియో కలిపి 500 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించింది. తాజాగా జైలర్–2 చిత్రం కోసం నువ్వు కావాలయ్యా 2.ఓ పాట లోడింగ్ అవుతున్నట్లు తెలిసింది. కూలీ చిత్రాన్ని పూర్తి చేసిన రజనీకాంత్.. ప్రస్తుతం తన కెరీర్‌కు బూస్ట్ ఇచ్చిన జైలర్ చిత్రానికి సీక్వెల్ పనుల్లో ఆయన బిజీగా ఉన్నారు. నెల్సన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. ప్రస్తుతం జైలర్–2 చిత్ర షూటింగ్ కేరళలో జరుగుతోంది. ఈ చిత్రంలో మోహన్‌లాల్, బాలకృష్ణ కూడా కీలక పాత్ర పోషిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రానికి అనిరుద్ సంగీతాన్ని, విజయ్ కార్తీక్ కన్నన్ చాయాగ్రహణం అందిస్తున్నారు. కాగా తమన్నా జైలర్–2 చిత్రంలోని క్యామియో పాత్రలో నటించడానికి సిద్ధమవుతున్నట్లు తాజా సమాచారం. దీంతో నువ్వు కావాలయ్యా 2.ఓ లోడింగ్ అవుతోంది అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

## రిలీజైన 10 రోజులకే ఓటీటీ రిలీజ్ గురించి పోస్ట్




ప్రస్తుతం చిన్న సినిమాలని ప్రేక్షకులు పెద్దగా పట్టించుకోవట్లేదు. మరీ బాగుంది అంటే తప్పితే థియేటర్లకు వెళ్లి వీటిని చూసేందుకు ఆసక్తి చూపించట్లేదు. అయినా సరే యంగ్ హీరోలు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే బిగ్ బాస్ ఫేమ్ గౌతమ్ కృష్ణ కూడా రీసెంట్‌గానే తన కొత్త సినిమాతో వచ్చాడు. ఇప్పుడు ఇది థియేటర్లలో ఉండగానే ఓటీటీ రిలీజ్ గురించి అప్‌డేట్ ఇచ్చేశాడు. బిగ్‌బాస్ 7, 8 సీజన్లలో పాల్గొన్న గౌతమ్ కృష్ణ.. అంతకు ముందు ఒకటి రెండు సినిమాలు చేశాడు. కానీ 7వ సీజన్ పూర్తయిన తర్వాత ఈ మూవీ మొదలుపెట్టాడు. దాని షూటింగ్ అంతా పూర్తి చేసి ఈ నెల 4న థియేటర్లలో రిలీజ్ చేశారు. ప్రమోషన్లు కాస్తోకూస్తో చేశారు. అందుకు తగ్గట్లే పాజిటివ్ టాక్ అయితే వచ్చింది గానీ జనాలు పెద్దగా పట్టించుకోలేదు.

ఈ క్రమంలోనే ఇప్పుడు సినిమాని ఓటీటీలోకి తీసుకొచ్చేస్తున్నట్లు హీరో గౌతమ్ కృష్ణ పోస్ట్ పెట్టాడు. త్వరలో స్ట్రీమింగ్ అప్‌డేట్ ఉంటుందని అన్నాడు. అంటే మరో వారంలో డిజిటల్‌గా అందుబాటులోకి వచ్చేస్తుందేమో?

'సోలోబాయ్' విషయానికొస్తే.. కృష్ణమూర్తి(గౌతమ్ కృష్ణ) మిడిల్ క్లాస్ కుర్రాడు. ఇంజినీరింగ్ చదువుతూ ప్రియ(రమ్య పసుపులేటి)తో ప్రేమలో పడతాడు. కానీ ఓ సందర్భంలో ఆమె బ్రేకప్ చెప్పడంతో మద్యానికి బానిసైపోతాడు. తండ్రి ప్రోత్సాహంతో మళ్లీ మాములు మనిషిగా మారి ఉద్యోగంలో చేరతాడు. అక్కడ శ్రుతి(శ్వేత అవస్తి) అనే అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకుంటాడు. జీవితం సాఫీగా సాగుతుందన్న సమయంలో తండ్రి మరణిస్తాడు. అదే సమయంలో ఆర్థిక పరిస్థితుల కారణంగా భార్య శ్రుతి విడాకులు ఇస్తుంది. ఒకవైపు తండ్రి మరణం, మరోవైపు భార్య విడాకులు.. వీటన్నింటిని తట్టుకొని కృష్ణ మూర్తి మిలియనీర్‌గా ఎలా ఎదిగాడు? అనేదే స్టోరీ.



## మధ్య తరగతి తెలుగబ్బాయి

సంతోష్ శోభన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మానసా వారణాసి హీరోయిన్‌గా నటించారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. ఈ సినిమా త్వరలో తెలుగు, తమిళ భాషల్లో విడుదలకు సిద్ధమవుతోంది. కాగా జూలై 12న సంతోష్ శోభన్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి ప్రత్యేక పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ''మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీగా 'కపుల్ ఫ్రెండ్లీ' తెరకెక్కింది. చెన్నైలో లైఫ్ లీడ్ చేస్తున్న ఓ మధ్య తరగతి తెలుగబ్బాయిగా సంతోష్ శోభన్ కనిపిస్తారు. చెన్నై నేపథ్యంలో సాగే ఈ ప్రేమకథా చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతి ఇచ్చేలా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: దినేష్ పురుషోత్తమన్, సంగీతం: ఆదిత్య రవీంద్రన్.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com